



టీడీపీకి ఓట్లు వేశారని... తలలు పగులగొట్టారు

- వైసీపీ నేతల అండతో రెచ్చిపోయిన కుటుంబం
- మహిళలని చూడకుండా దాడి
- బర్మా క్యాంపు ప్రాంతంలో దారుణం

... మెయిన్‌లో

ఓటు..నోటు

చాలా ప్రాంతాల్లో ఓటర్ల డిమాండ్

- ఈసారి ఎన్నికల్లో కొత్త ట్రెండ్
- గతంలో ఇస్తే తీసుకునేవారు...లేకపోతే ఊరుకునేవారు
- ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ఇళ్లకు, కార్యాలయాలకు వెళ్లి మరీ గొడవ
- ఇచ్చేంత వరకు వెళ్లబోమని పట్టు
- స్థానిక సమస్యలపై అలా నిలదీసే చైతన్యం ఎప్పుడు వస్తుందో



డబ్బుల కోసం పోలింగ్‌కు ముందు రోజు నగరంలోని ఓ అధికార పార్టీ అభ్యర్థి కార్యాలయానికి వచ్చిన ఓటర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఈ ఎన్నికల్లో చాలా స్పష్టమైన మార్పు ఒకటి కనిపించింది. అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అదే 'ఓటుకు... నోటు'. ఇది కొత్త విషయం ఏమీ కాదు. ఓటర్లకు డబ్బులు పంచడం ఎప్పటి నుంచో రాజకీయ పార్టీలకు అలవాటైన పని. ఆ వ్యవహారం రహస్యంగా, మూడో కంటికి తెలియకుండా జరిగేది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది.

ఓటర్లకు కిందిస్థాయి నాయకులు డబ్బులు ఇవ్వడం లేదని గుర్తించిన అభ్యర్థులు ఈసారి రెండు రకాల పద్ధతులను అనుసరించారు. ముందుగా ఓటర్లకు చీటీలు ఇవ్వడం, ఆ తరువాత ఎక్కడో ఒక దగ్గర ఆ చీటీలు తీసుకొని డబ్బులు పంపిణీ చేయడం. కొందరైతే నేరుగా ఇళ్లకు వెళ్లి...ఓటరు కార్డు పరిశీలనకు, పోలింగ్ బూత్ స్లిప్పులు ఇవ్వడానికి వచ్చినట్టు చెప్పి...ఓటర్ల సంఖ్య ఆధారంగా డబ్బులు ఇచ్చి వెళ్లిపోయారు. ఇలా ఎవరికి నచ్చినట్టు వారు చేసుకుపోయారు. ఎక్కువ మంది అభ్యర్థులు వార్డులు, గ్రామస్థాయి నాయకులకు కొంత మొత్తం ఇచ్చి...స్థానికంగా పంచాల్సిందిగా చెప్పేశారు. ఇక్కడే వ్యవహారం బెడిసికొట్టింది. కొంతమంది నాయకులు ఓటర్లు అందరికీ ఇవ్వకుండా, కొందరికే ఇచ్చి, మిగిలిన మొత్తం జేబులో వేసుకున్నారు. చిన్న మొత్తాలైతే ఎవరూ పట్టించుకునేవారు కాదేమో! కొన్ని ప్రాంతాల్లో ఓటుకు రూ.5 వేల వరకు ఇచ్చారు. నగర పరిధిలోని ఒక నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి ఓటుకు రూ.2,500 పంపిణీ చేశారు. ప్రతి ఇంట్లో కనీసం రెండు నుంచి నాలుగు ఓట్లు ఉంటాయి. ఒక ఇంటికి డబ్బు ఇవ్వకుండా దాటేస్తే...అక్కడ రూ.5 వేలు నుంచి రూ.10 వేలు మిగిలినట్టే. పక్క ఇంట్లో వేల రూపాయలు ఇచ్చి, తమకు ఇవ్వకపోడం ఏమిటనే ఆవేదన ఎక్కువ మందిలో కలిగింది. తూర్పు నియోజకవర్గంలో దిగువ మధ్య తరగతి, పేదలు ఉన్న వార్డుల్లో పంపిణీలో తేడాలు భారీగా రావడంతో వారంతా పోలింగ్ ముందురోజు ఏకంగా అభ్యర్థి కార్యాలయానికి వెళ్లారు. తమకు డబ్బులు ఎందుకు ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. తమకు వార్డు స్థాయి నాయకులు అన్యాయం చేశారని ఫిర్యాదు చేశారు. గాజువాక నియోజక వర్గంలో అయితే ఒక పార్టీ అభ్యర్థి ఇంటికి నేరుగా మహిళా ఓటర్లు వెళ్లి...డబ్బులు డిమాండ్ చేశారు. తమకు నగదు అందలేదని, ఇప్పుడు ఇవ్వాలని పట్టుబట్టారు. ఇది చాలా కొత్త పరిణామం. గతంలో ఎవరైనా ఓట్లకు డబ్బులు అందకపోతే...'పోనీలే' అని ఊరుకునేవారు. నిలదీసి అడిగితే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అంటారని మౌనంగా ఉండేవారు. ఇప్పుడు అలా ఎవరూ ఊరుకోలేదు. ఓటుకు డబ్బు తీసుకోవడం తమ హక్కుగా భావించి, దానికోసం పోరాడైనా సాధించాలనుకున్నారు. ఇది అభ్యర్థులు ఊహించని విషయం.

ఉసిగొల్పిందే వారే!!

ఈసారి ఎన్నికలు ఇలా జరగడానికి కారణం కూడా రాజకీయ పార్టీలే. అన్ని పార్టీలూ కూడా ఓటుకు నోటు తీసుకోవాలని పబ్లిక్‌గా ప్రోత్సహించాయి. నాయకులు బహిరంగ సభల్లో...'ఫలానా పార్టీ ఓట్ల కోసం డబ్బులు ఇస్తుందని, కాదనకుండా తీసుకోవాలని, అదంతా వారి సొమ్ము కాదని, ప్రజల నుంచి దోచుకున్నదే కాబట్టి తప్పు లేదని ప్రచారం చేశారు. డబ్బులు తీసుకున్నా నచ్చిన పార్టీకి ఓట్లు వేసుకోవచ్చునని ... మిగతా 6వ పేజీలో

ఆ ఐదు సెగ్మెంట్లలో పోలింగ్ తక్కువే

- రాష్ట్ర వ్యాప్తంగా ఓటింగ్ తక్కువ నమోదైన 16 నియోజకవర్గాల్లో నగర పరిధిలో ఐదు సెగ్మెంట్లు
- రెండో అతి తక్కువ పోలింగ్ నమోదైన నియోజకవర్గంగా విశాఖ 'సౌత్'
- పార్లమెంటు నియోజకవర్గాల్లోనూ అట్టడుగున విశాఖ

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికలతో పోల్చితే విశాఖ జిల్లాలో 3.78 శాతం మేర ఓటింగ్ పెరిగినా రాష్ట్రంలో అతి తక్కువ ఓట్లు పోలైన నియోజక వర్గాల్లో ఐదు నగర పరిధిలోనే ఉన్నాయి. అతి తక్కువ ఓటింగ్ జరిగిన నియోజక వర్గాల్లో 63.42 శాతంతో తిరుపతి మొదటి స్థానంలో ఉండగా, 63.42 శాతంతో విశాఖ దక్షిణ నియోజకవర్గం రెండో స్థానంలో ఉంది. 'సౌత్'లో 2,16,770కి 1,37,474 మంది (63.42 శాతం) ఓటేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 నియోజక వర్గాల్లో (తిరుపతి, విశాఖ దక్షిణ, కర్నూలు, పాడేరు, విశాఖ ఉత్తరం, అనంతపురం అర్బన్, కడప, విజయవాడ పశ్చిమ, గుంటూరు పశ్చిమ, ఆదోని, రాజమండ్రి అర్బన్, నెల్లూరు రూరల్, శ్రీకాకుళం, విశాఖ తూర్పు, ఇచ్ఛాపురం, విశాఖ పశ్చిమ, గాజువాక) అతితక్కువ ఓట్లు పోలయ్యాయి. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 63.42 శాతం, ఉత్తరంలో 64.63 శాతం, తూర్పులో 68.64, పశ్చిమలో 69.78 శాతం, గాజువాకలో 69.83 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోల్చితే విశాఖ జిల్లాలో 3.78 శాతం ఓటింగ్ పెరిగింది. అయినా రాష్ట్రంలో తక్కువ ఓట్లు పోలైన నియోజకవర్గాలు ఇక్కడే ఉండడానికి నగరంలో కొన్ని వర్గాలు ఓటింగ్‌కు దూరంగా ఉండడం, ఇంకా ఇక్కడ నివాసం ఉంటున్న వారిలో చాలామందికి సొంతూరులో కూడా ఓటు ఉండడం కారణాలుగా రిటైర్డు రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు. నేవీ ఉద్యోగులు, అధికారులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ఉన్నత వర్గాలకు చెందినవారు (వైద్యులు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, బ్యాంకు ఉన్నతాధికారులు) పలువురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారని వివరించారు. దీనికితోడు నగరంలో కొన్నిచోట్ల ఇరుకు గదుల్లో బూత్‌లు ఏర్పాటుతో ఉక్కపోతను భరించలేక కొందరు, గంటలకొద్దీ క్యూలో నిలబడలేక మరికొందరు ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారని పోలింగ్ విధుల్లో ఉన్న పోలీసులు కొందరు తెలిపారు.

విశాఖ ఎంపీ స్థానంలోనూ అతి తక్కువ ఓటింగ్

రాష్ట్రంలోని 25 పార్లమెంటుస్థానాల్లో అత్యధికంగా ఒంగోలు నియోజకవర్గంలో 87.06శాతం ఓట్లుపోలయ్యాయి. అతి తక్కువగా విశాఖ పార్లమెంటు నియోజకవర్గంలో 71.11 శాతం ఓట్లు పోలయ్యాయి. నగరంలో తక్కువ ఓటింగ్ జరిగినా ఎస్.కోటలో 85.45%,భీమిలిలో 75.96% ఓట్లు పోల్ కావడంతో 71.11 శాతానికి చేరుకుంది.

నత్తనడకన గ్యాస్ పైప్‌లైన్

కాకినాడ-శ్రీకాకుళం పైప్‌లైన్ నిర్మాణానికి 2014లో శ్రీకారం

- మూడేళ్లలో పూర్తిచేయాలని నిబంధన
- ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్, గెయిల్ కలిసి జాయింట్ వెంచర్
- పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డుతో ఒప్పందం
- పదేళ్లయినా పూర్తి చేయకపోవడంతో రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థ
- కొత్త వారిని ఆహ్వానిస్తూ ప్రకటన జారీ
- విశాఖలో సేవలకు మరింత జాప్యం



పైపులైన్ నిర్మాణం (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు పైప్‌లైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా చేసేందుకు చేపట్టిన ప్రాజెక్టు నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన సంస్థను కేంద్రం తప్పించింది. ఈ ప్రాజెక్టును 2014లో చేపట్టగా మూడేళ్లలో పూర్తి చేయాలనే నిబంధన పెట్టారు. ఏళ్లు గడుస్తున్నా ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ఏపీ ప్రభుత్వం సమకూర్చకపోవడంతో తాజాగా ఈ ఒప్పందం రద్దు చేశారు. సగంలో ఆగిన ఈ ప్రాజెక్టును చేపట్టడానికి ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకు రావాలంటూ కేంద్ర సంస్థ బిడ్లను ఆహ్వానించింది.

ఇదీ పైప్‌లైన్ ప్రాజెక్ట్ కథ

కేంద్ర ప్రభుత్వ సంస్థ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) కాకినాడ-శ్రీకాకుళం మధ్య పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందించేందుకు ప్రాజెక్టును 2014లో చేపట్టింది. దీని పొడవు 391 కి.మీ. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,103 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) కలిసి జాయింట్ వెంచర్ కింద ఈ ప్రాజెక్టును తీసుకున్నాయి. మూడేళ్లలో పూర్తి చేయాలనేది ఒప్పందం.

అయితే ఏపీ ప్రభుత్వం అవసరమైన నిధులు సమకూర్చకపోవడం వల్ల పనులు అనుకున్న విధంగా జరగలేదు. దీనిపై సమీక్షలు నిర్వహించినప్పుడల్లా గడువు కోరుతూ వచ్చారు. 2019లో కరోనా రావడంతో కొన్నాళ్లు దానిని సాకుగా చూపించారు. నిధుల కొరత వల్లే పనులు చేపట్టలేకపోతున్నామని గెయిల్ స్పష్టంచేసింది. ఇందులో గెయిల్‌కు 89 శాతం వాటా కాగా, ఏపీ ప్రభుత్వం వాటా 11 శాతం. అది తక్కువే అయినప్పటికీ నిధులు సమకూర్చలేదు.ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, గడువు పెంచుతూ 2024 జూన్ నాటికి పూర్తి చేయాలని స్పష్టంచేశారు. అయితే అందుకు తగిన విధంగా పనులు జరగకపోవడంతో కేంద్ర సంస్థ ఈ గడువుకు ముందే జాయింట్ వెంచర్ ప్రాజెక్టును రద్దు చేసింది. దీనిని పూర్తి చేయడానికి సామర్థ్యం కలిగిన సంస్థలు ముందుకు రావాలని నోటిఫికేషన్ జారీచేసింది. దానికి స్పందించిన హెచ్‌పీసీఎల్ సంస్థ, ఈ ప్రాజెక్టును పూర్తి చేయగల సత్తా ... మిగతా 6వ పేజీలో

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 22,763

అందులో జిల్లాకు సంబంధించినవి 15,450

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 22,763 ఓట్లు పోలయ్యాయి. ఈ నెల ఐదో తేదీ నుంచి పదో తేదీ వరకు ఏయూ ఉన్నత పాఠశాలలు, ఆర్వో కార్యాలయాల్లో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో 20,455 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో జిల్లాలో ఓటు ఉన్న ఉద్యోగులు 15,450 మంది ఉన్నారు. అత్యధికంగా పెందుర్తి నియోజక వర్గానికి సంబంధించి 2,810 మంది, విశాఖ తూర్పు నియోజవర్గానికి చెందినవారు 2,716 మంది, గాజువాక 2,401 మంది, భీమిలి 2,366, 'నార్త్' 2,307, 'సౌత్' 1,429 మంది, పశ్చిమ నియోజక వర్గానికి చెందినవారు 1,421 మంది ఉన్నారు. వీరుకాకుండా జిల్లాలో పనిచేస్తూ ఇతర ... మిగతా 6వ పేజీలో

జోరుగా బెట్టింగ్

ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఫలితాలపై అందరి దృష్టి



- ప్రస్తుతం 2:1 రేషియోలో జరుగుతున్న పందాలు
- మరికొన్ని నియోజకవర్గాల్లో మెజారిటీలపైనే...
- రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై అక్కడకక్కడా పందాలు
- కూటమి వైపు అత్యధికులు మొగ్గు
- విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీ స్థానాల్లో వైసీపీ గెలుపుపై బెట్టింగ్‌కు ఎవరూ ముందుకు రాని పరిస్థితి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓటర్ల తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. వచ్చే నెల నాలుగో తేదీన అభ్యర్థుల భవితవ్యం వెల్లడి కానున్నది. విజయం ఎవరిని వరిస్తుందనే చర్చ సర్వత్రా నడుస్తోంది. మరోవైపు గెలుపోటములపై బెట్టింగ్ జోరందుకుంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, మెజారిటీలపై బెట్టింగ్ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఎవరు ఏర్పాటుచేస్తారనే దానిపై కూడా అక్కడక్కడా పందేలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని ఎక్కువ మంది పందాలకు ఎగబడుతుండడంతో 2:1 నిష్పత్తిలో బెట్టింగ్ జరుగుతోంది.

ఈనెల 13న పోలింగ్ ముగిసింది. వచ్చే నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది. పోలింగ్ సరళిని బట్టి ఎవరికి వారు తమకు తోచింది చెబుతున్నారు. తమ అంచనాలను వెల్లడిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో విజయం ఏకపక్షమేనని ప్రచారం జరుగుతుండగా, మరికొన్ని నియోజక వర్గాలపై మాత్రం ఒక అంచనాకు రాలేకపోతున్నారు. విశాఖ ఉత్తరం, పశ్చిమ, మాడుగుల, పెందుర్తి వంటి నియోజక వర్గాలపై ఎక్కువ పందాలు సాగుతున్నాయి. భీమిలి, గాజువాక, విశాఖ సౌత్ వంటి నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు వచ్చే మెజారిటీపై బెట్టింగ్ కడుతున్నారు. ఈ అంశాల్లో రెండు వర్గాలు సమాన మొత్తంలో బెట్టింగ్ కడుతుంటే, రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు అంశంపై మాత్రం 2:1 నిష్పత్తిలో బెట్టింగ్ జరుగుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేయడం ఖాయమని ప్రచారం జరుగుతుండడంతో బెట్టింగ్ కట్టేందుకు రెండో వైపు నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కూటమి అధికారం దక్కించుకుంటుందని భావిస్తున్నవారు రెండొంతులు తమ వాటాగా, ఒక వాటా వైసీపీ వైపు బెట్టింగ్ కాసేవారిని పెట్టుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వస్తుందనేవారు రెండు వాటాలు, వైసీపీ అధికారంలోకి వస్తుందని భావిస్తున్న వారంతా ఒక వాటా...అంటే 2:1 రేషియోలో పందాలు సాగుతున్నాయి. వైసీపీకి వచ్చే ఎంపీ ... మిగతా 6వ పేజీలో

వర్షం



నగరంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకూ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండలతో అల్లాడిన నగర వాసులకు గురువారం కురిసిన వర్షం, ఉదయం పూటంతా ముసురు వాతావరణం ఊరటనిచ్చింది. రానున్న 24 గంటల్లో కూడా కోస్తాలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

- విశాఖపట్నం

వ్యాపార కేంద్రాలుగా రైతుబజార్లు

- పైస్థాయిలో కొనుగోళ్లు... సిబ్బంది ద్వారా విక్రయాలు
- రవాణా చార్జీలు కూడా ఇవ్వడం లేదని గగ్గోలు
- బయట కంటే ధరలు కూడా అధికమే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రైతుబజార్లు ఉన్నతాధికారులకు ఆదాయ వనరులుగా మారిపోయాయి. వీటిలో ఏ ఉత్పత్తులు పెట్టినా బాగా అమ్ముడవుతాయని తెలియడంతో అధికారులే టోకున కొని, చిల్లరగా అమ్మించి భారీగా లబ్ధి పొందుతున్నారు. వాస్తవానికి రైతుబజార్లలో రైతులతో పాటు డ్వాక్రా సంఘాలు వివిధ వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముతున్నాయి. వీరు కాకుండా సూపర్ బజార్, డీసీఎంఎస్, ఇతర వ్యాపారులు ఒక్కో దుకాణానికి నెలకు రూ.15 వేలు అద్దె చెల్లించి, కిరాణా సరకులు, బియ్యం అమ్ముకుంటున్నారు.



ఎంవీపీ రైతుబజార్

ఇటీవల కాలంలో విజయవాడ, గుంటూరుల్లోని ఉన్నతాధికారులు ఈ రైతుబజార్ల ద్వారా లాభాలు గడించాలని రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొన్నటి వరకు శెనగపప్పు అమ్మించారు. బయట మార్కెట్‌లో కిలో రూ.82 ఉండగా ఇక్కడ రూ.65 చొప్పున విక్రయించారు. హమాలీ చార్జీలు, లాభం కింద కిలోకి మూడు రూపాయలు ఇచ్చేవారు. అలాగే రాగి పిండి, జొన్న రవ్వ, జొన్న పిండి కూడా విక్రయించారు. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే...ఈ సరకులను రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్, అటెండర్ కలిసి అమ్మాలని చెబుతున్నారు. ఇప్పటికే వారికి అనేక బాధ్యతలు అప్పగించి, వాటిని సరిగ్గా చేయడం లేదని మెమోలు ఇస్తున్నారు. బోర్డులపై రేట్లు సరిగ్గా రాయలేదని, బజార్‌కు ఎన్ని కూరగాయలు, ఎంతెంత వచ్చాయో ఏ రోజుకు ఆ రోజు రికార్డు రాయడం లేదని తనిఖీలు చేస్తూ హెచ్చరిస్తున్నారు. ఈఓ బజార్ అంతా తిరిగి చూసుకోవాలని చెబుతున్నారు. అటెండర్ ఆఫీసు ముందు దుకాణం పెట్టి సరకులు అమ్మాలని సూచిస్తున్నారు. ఇవి చాలవని తాజాగా గుంటూరు నుంచి ఉన్నతాధికారులు అన్ని జిల్లాల సరకులు అన్ని రైతుబజార్లలో అమ్మాలని కొత్త పథకానికి తెర తీశారు. అనంతపురం వేరుశెనగలు, గుంటూరు నుంచి కారం, దుగ్గిరాల నుంచి పసుపు, పలాస నుంచి జీడిపప్పు హోల్‌సేల్‌లో కొంటున్నారు. వాటిని గోపాలపట్నంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి పంపుతున్నారు. ప్రతి రైతుబజార్ ఈఓ అక్కడకు వెళ్లి వాటిని తీసుకొని, వారి బజార్లలో విక్రయించాలి. ఆ సొమ్మును గుంటూరు అధికారులకు చెల్లించాలి.ఇలా చేసినందుకు రూపాయి కూడా ఇవ్వడం లేదు. దీనికోసం రైతుబజార్ల సిబ్బంది రవాణా వ్యయంతో పాటు ప్యాకింగ్ ఖర్చులు కూడా భరించాల్సి వస్తోంది. కేవలం పసుపు, కారం మాత్రమే ప్యాకింగ్ చేసి ఇస్తున్నారు. వేరుశెనగ, జీడిపప్పులు లూజుగా ఇచ్చి ప్యాకింగ్ చేసుకోమంటున్నారు.ఈ బాధలన్నీ మాకు ఏమిటి?...అని ప్రశ్నిస్తే వారిపై అధికారులు కక్షగట్టి ఏదో ఒక రూపాన మెమో ఇస్తున్నారు.

ధరలు కూడా అధికమే

రైతుబజార్లలో ఏ సరకు అయినా బయట కంటే తక్కువ ధరకు లభిస్తుందనేది అందరి నమ్మకం. కానీ మార్కెటింగ్ శాఖ అధికారులు ఆ నమ్మకాన్ని పోగొడుతున్నారు. వేరుశెనగలు బయట మార్కెట్‌లో కిలో రూ.115కి లభిస్తుంటే రైతుబజార్లలో రూ.140 చొప్పున అమ్మమంటున్నారు. అలాగే పలాస జీడిపప్పు బయట కిలో రూ.650కే దొరుకుతుంటే ఇక్కడ రూ.720 రేటు నిర్ణయించారు. గుంటూరు కారం రేటు కూడా కిలో రూ.300 పెట్టారు. బయట ఆశీర్వాద్ వంటి బ్రాండ్ల కారం తక్కువకే దొరుకుతోంది. వీటిని లాభం, నష్టం లేని ... మిగతా 6వ పేజీలో

అక్కడ ఓట్లు 34...పోలైంది 23

- అత్యధికంగా వసంతబాల పాఠశాలలో 1,416 ఓట్లకుగాను 1,070 ఓట్లు పోల్
- ఇదీ 'సౌత్'లో ఓటింగ్ సరళి



వైర్‌లెస్ కాలనీ

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతి తక్కువ ఓట్లు పోలైన నియోజక వర్గాల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం రెండో స్థానంలో ఉంది. అయితే నియోజకవర్గంలో బూత్ నంబరు 55లో కేవలం 34 ఓట్లు మాత్రమే ఉండగా 23 (67.64 శాతం) మాత్రమే పోలయ్యాయి. రాష్ట్రంలో అతి తక్కువ ఓట్లు ఉన్న బూత్‌లలో ఇదొకటి. అత్యధికంగా కలెక్టరేట్ ఎదురుగా బెల్లం వినాయకుడి గుడి సమీపాన వసంతబాల విద్యోదయ ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబర్ 170లో 1,416 ఓట్లకుగాను 1,070 (75.56 శాతం) పోలయ్యాయి. నియోజకవర్గంలో 237 పోలింగ్ బూత్‌లుండగా 100 లోపు ఓట్లు పోలైనవి రెండు, వెయ్యి దాటి పోలైనవి రెండు బూత్‌లు ఉన్నాయి. వంద ఓట్లు కంటే తక్కువగా వైర్‌లెస్ కాలనీలో (రైల్వేస్టేషన్‌కు ఎదురుగా) ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన బూత్ నంబరు 55లో 23 మంది ఓటేశారు. వైర్‌లెస్ కాలనీలో పోలీస్ క్వార్టర్స్ కూల్చివేయడంతో అక్కడ నివసించే ఉద్యోగులు మరో ప్రాంతానికి వెళ్లిపోగా కేవలం 34 మంది ఓటర్లు (పురుషులు 23, మహిళలు 11) మిగిలారు. అయితే పోలింగ్ బూత్‌ను తరలించాల్సి ఉన్నా ఓటర్ల సౌలభ్యం కోసం కొనసాగించడంతో 15 మంది పురుషులు, ఎనిమిది మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంకా రైల్వే న్యూకాలనీలో సుబ్బలక్ష్మీనగర్ పరిధి ఓంకార్ నగర్‌లో 231 ఓట్లు (పురుషులు 113, మహిళలు 118) ఉండగా కేవలం 83 మంది (పురుషులు 43, మహిళలు 40 మంది) ఓటు వేశారు. నియోజకవర్గంలో 237 పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తే...100 నుంచి 201 మధ్యన ఓటర్లు ఉన్నవి మూడు బూత్‌లుండగా, 200 నుంచి 300 మధ్యన 11, 301 నుంచి 400 ఓటర్లు కలిగిన బూత్‌ల సంఖ్య 25. ఇంకా 401 నుంచి 500 ఓట్లు పోలైన బూత్‌ల సంఖ్య 44, 501 నుంచి 600 ఓట్లు వరకు పోలైన బూత్‌ల సంఖ్య 46. 601 నుంచి 700 ఓటర్లు వరకు 44 బూత్‌లలో, 701 నుంచి 800 మంది ఓట్లు పోలైన బూత్‌ల ... మిగతా 6వ పేజీలో

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం


అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పూర్ణామార్కెట్, మే 16: వన్‌టౌన్‌లోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అధికారులు, అర్చకులు త్రికాల పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. ఉభయ దాతలతో అర్చకులు అభిషేక సేవలను జరిపించారు. ఈ పూజల్లో పాల్గొన దలచిన భక్తులు టికెట్ తీసుకుని పాల్గొనవచ్చని ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కాగా అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ఉచిత అన్న ప్రసాద వితరణ జరిగింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మే 16: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం చర్యలు చేపడుతున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పాపా హోమ్‌ఏరియా, ప్రెసిడెన్షియల్ స్కూల్ ఏరియా, వెలమభవన్ ఏరియా, బీఎస్ లే అవుట్ ఏరియా, హిల్ వ్యూ పార్క్ ఏరియా, రాకెట్ పార్క్ ఏరియా, ఏఎస్‌ఆర్‌నగర్ ఏరియా, వోల్వో ఆఫీస్ ఏరియా, ఏఎస్‌ఆర్‌నగర్, సబ్బంహరి ఇల్లు ఏరియాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

19 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

మురళీనగర్, మే 16: మురళీనగర్ శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో బందారు ప్రసాద్, అర్చకులు శేషు స్వామి తెలిపారు. ఈనెల 19న ఉదయం 5 గంటలకు అంకురార్పణ, పతాక ప్రతిష్ఠ విశేష హోమం జరుగుతుంది. సాయంత్రం ఐదు గంటలకు ఎదురు సన్నాహోత్సవం, 6 గంటలకు 'శ్రీవారి కల్యాణ మహోత్సవం" చేస్తామన్నారు. 20న లక్ష మల్లెల అర్చన, సదనోత్సవం, 21న వసంతోత్సవం, పూర్ణాహుతి, ఊంజల్ సేవ, 22న తిరువీధి, 23న పంచామృతాభిషేకం అనంతరం భక్తులకు వజ్ర కవచంతో శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు ఈవో తెలిపారు.


ప్రమాదకర పరిస్థితిలో జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులు


మధ్యలో నిలిచిపోయిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

ప్రమాదాలకు నిలయం కప్పరాడ జంక్షన్

- కొండవాలు ప్రాంత వాసులకు ఏకైక మార్గం
- నిత్యం ప్రమాదాలు.. పలువురు మృత్యువాత
- ఫుట్‌ఓవర్ నిర్మాణంపై అలసత్వం

కంచరపాలెం, మే 16: గ్రేటర్ 46, 47,48 వార్డుల పరిధిలోని కొండవాలు ప్రాంతాల ప్రజలు కంచరపాలెం మెట్టు మీదుగా ప్రయాణించాలంటే ప్రాణ సంకటంగా మారింది. వీరంతా జాతీయ రహదారిని కప్పరాడ జంక్షన్ వద్ద దాటాల్సి రావడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోననే భయాందోళన చెందుతున్నారు. ఈజంక్షన్ వద్ద పాదచారులు, వాహనదారులు దాటే ప్రయత్నంలో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్ వద్ద రోడ్డు క్రాస్ చేసే ప్రయత్నంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక బీట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పాదచారులకు దిక్సూచిగా నిలిచేవారు. అయితే, ఇటీవల ప్రత్యేకంగా ట్రాఫిక్ సిబ్బంది కనిపించకపోవడంతో పాదచారులు, విద్యార్థులు నిత్యం రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడి సమస్యకు జీవీఎంసీ అధికారులు, పాలకులు పరిష్కారం చూపాల్సి ఉంది.

ఏళ్లుగా నిలిచిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు

గతంలో ఇక్కడ హైవేను దాటడానికి కొండవాలు గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పనులను ప్రారంభించారు. భారీ స్థాయిలో 15 ఏళ్ల కింద చేపట్టిన పనులు పునాదుల దశ వరకు నిర్మాణాలను శరవేగంగా పూర్తిచేసి అనంతరం వదిలేశారు. అప్పటినుంచి పాదచారులు రోడ్డును దాటే వెసులుబాటు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బ్రిడ్జి నిర్మాణం విషయంలో రాజకీయ నాయకులు పూర్తిస్థాయిలో చొరవచూపాల్సిన అవసరం ఉంది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తరువాత అయినా స్థానిక ఎమ్మెల్యే ఇక్కడి సమస్యపై దృష్టి సారించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు, పనులు సత్వరం పూర్తిచేయాలని ప్రజలు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విశాఖలో చెవిరెడ్డి స్కామ్ రూ.వెయ్యి కోట్లు

- జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి యాదవ్

సీతమ్మధార, మే 16: నిత్యం దైవ నామ స్మరణంలో ఉన్నట్టు కనిపించే వైసీపీ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విశాఖ రూ.వెయ్యి కోట్లకు పైగా పంగనామం పెట్టారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. సీఎం జగన్‌ను హిందువులు వ్యతిరేకించకుండా ఆయన ఇంట్లో గోశాల ఏర్పాటు చేసి పదేపదే ఆలయ సెట్లు నిర్మించి, ఆ పలుకుబడితో విశాఖలో భారీ స్కాములు చేసేశారన్నారు. బినామీలతో రుషికొండను విధ్వంసం చేయించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్కడి ఎర్రమట్టిని మాత్రం విశాఖ పోర్టుకు తరలించి భారీగా లబ్ధి పొందారన్నారు. ఈ సమావేశంలో జనసేన చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు, నాగలక్ష్మి చౌదరి, టీడీపీ నేత పోతనరెడ్డి, పోతు వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

20 నుంచి పరదేశమ్మ అమ్మవారి పండగ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

అక్కయ్యపాలెం, మే 16: తాటిచెట్లపాలెంలోని పరదేశమ్మ అమ్మవారి పండగ ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్నట్టు శ్రీ పరదేశమ్మ గ్రామ సేవా సమితి అధ్యక్షుడు సదరం ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయ ఆవరణలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20న తొలేళ్ళు, 21న ప్రధాన పండగ నిర్వహిస్తామన్నారు. అలాగే 28వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు మారువారం సందర్భంగా సారె ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డేటి జగత్‌రావు, సెక్రటరీ బోర అప్పలరెడ్డి, కోశాధికారి కొత్తపల్లి నాగేశ్వరరావు, ఆడిటర్ సీరపు నాగేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు నూనెల పోలారావు, యడ్ల శ్రీనివాసరెడ్డి, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్, మే 16: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 18 నుంచి 21 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వస్తున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు డాక్టర్ కే.ఎం.ఉన్నికృష్ణన్ నాయర్ చర్మవ్యాధులు, ఆందోళన, మానసిక ఒత్తిడి, నిద్ర లేమి, తదితర సమస్యలతో బాధపడే వారికి చికిత్స అందిస్తారన్నారు. వివరాలకు 76758 61446 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి ఎర్నిమాంబ ఉత్సవాలు

జ్ఞానాపురం: జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి మహోత్సవాలు ఈ నెల 18, 19 తేదీల్లో జరపనున్నట్లు ఈవో తెలిపారు. 18న తొలేళ్లు, అమ్మవారి ప్రతిమల ఊరేగింపు, 19న ప్రధాన పండగ జరుగుతుందని చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి దేవాలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన, 25న అన్న ప్రసాద వితరణ చేస్తామన్నారు.

టికెట్ తనిఖీలలో వాల్తేరు రికార్డు

విశాఖపట్నం: టికెట్ తనిఖీలలో వాల్తేరు రైల్వే కమర్షియల్ శాఖ రికార్డు నెలకొల్పిందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఏప్రిల్‌లో విస్తృత డ్రైవ్‌లతో జరిమానాల ద్వారా రూ.2.8 కోట్ల ఆదాయాన్ని సమకూర్చారన్నారు. గతంతో పోల్చితే ఒక నెలలో జరిమానాల ద్వారా ఆర్జించిన అత్యధిక ఆదాయం ఇదే కావడం విశేషమన్నారు.

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నాలుగోతేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆర్వోలు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంల తరలింపు, ఇతర సాంకేతిక ప్రక్రియల పూర్తి, తదితర అంశాలను ఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో చేపట్టిన చర్యలు సంతృప్తికంగా ఉన్నాయని, సమష్టి కృషితో అధికారులంతా సేవలందించారన్నారు. ఇదే ఒరవడి ఓట్ల లెక్కింపులోనూ కొనసాగాలన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతాపరమైన ఏర్పాట్లపై రోజువారీ సమీక్షించుకోవాలని ఆర్వోలను ఆదేశించారు. ప్రతిరోజు స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించి రావాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో రోజూ సంప్రదించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లను నిర్ణీత సమయంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరవేయాలని, భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్లను వేరుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయానికి ఎలాంటి సాంకేతిక అంశాలు పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. ఓట్లలెక్కింపు సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. సమన్వయంతో పనిచేసి ఫలితాల వెల్లడిలో గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచుకుని, కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంతవర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనకుమార్, ఆర్వోలు పాల్గొన్నారు.

బర్మాక్యాంప్ దాడిలో గాయపడిన వారికి గండి బాబ్జీ పరామర్శ


క్షతగాత్రులను పరామర్శిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తదితరులు

మాధవధార, మే 16: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేశారన్న అక్కసుతో కుటుంబసభ్యులపై చొరబడి వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ విమర్శించారు. ఉత్తర నియోజకవర్గంలోని 49వవార్డు బర్మాక్యాంపు నూకాంబిక ఆలయం వెనుక ఈ అమానుష ఘటన జరిగిందన్నారు. బాధిత కుటుంబసభ్యులను గురువారం రాత్రి టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్, నేతలతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. గీతం విద్యా సంస్థల ఛైర్మన్ ఎం.శ్రీభరత్ బాధితులకు వైద్యం నిమిత్తం అయ్యే ఖర్చుల్ని భరిస్తారని చెప్పారు. ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు పాల్పడడం దారుణమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రశాంత విశాఖలో వైసీపీ ఫ్యాక్షన్ రాజకీయాల్ని పోత్సహిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం హయాంలో ఇలాంటి విపరీత సంఘటనలు జరిగే తావు లేకుండా కృషి చేస్తామన్నారు.

విశాఖలో హింస పెరుగుతోంది: శ్రీభరత్

విశాఖపట్నం: విశాఖలో విష సంస్కృతిని పెంచుతూ రోజురోజుకీ శాంతిభద్రతలు దిగజారుస్తున్నారని పార్లమెంటు తెలుగుదేశం అభ్యర్థి ఎం.శ్రీభరత్ వ్యాఖ్యానించారు. బర్మాక్యాంప్‌లో టీడీపీ మద్దతుదారులపై వైసీపీ నాయకులు మహిళలు అని చూడకుండా దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు శ్రీభరత్ విజ్ఞప్తిచేశారు.

దాడిలో రాజకీయ ప్రమేయం లేదు: డీసీపీ

కంచరపాలెం: బర్మాక్యాంప్‌లో నూకరత్నం, ఆమె కుటుంబసభ్యులపై దాడిచేసిన నిందితుడు లోకేష్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని వెస్ట్ సబ్ డివిజన్ డీసీపీ మేక సత్తిబాబు తెలిపారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ ఘటనలో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదన్నారు. లోకేష్ కుటుంబానికి, నూకరత్నం కుటుంబానికి మధ్య పాతగొడవలున్నాయని, ఈ నేపథ్యంలోనే దాడి జరిగిందన్నారు. ఓట్ల కోసం జరిగిన దాడిగా తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఆ విధంగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఎమ్మెల్సీ రిపోర్టు ప్రకారం లోకేష్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఏసీపీ అన్నెం నరసింహమూర్తి, సీఐ ఎస్.భాస్కరరావు, ఎస్.దివ్యభారతి పాల్గొన్నారు.

వచ్చే నెల 30 నుంచి ఏపీఎల్ సీజన్-3

- బరిలో ఆరు జట్లు...మొత్తం 19 మ్యాచ్‌లు
- వేదికలుగా విశాఖ, కడపలోని స్టేడియాలు
- వివరాలు వెల్లడించిన ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 16: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 ఛాంపియన్‌షిప్ టోర్నీ వచ్చే నెల 30 నుంచి జరగనుందని ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీకి విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం, కడపలోని క్రికెట్ స్టేడియాలను వేదికలుగా ఎంపిక చేశామన్నారు. టోర్నీలో బెజవాడ టైగర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్, కోస్టల్ రైడర్స్ వంటి ఆరు ఫ్రాంఛైజర్ జట్ల మధ్య మొత్తంగా 19 మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో 12 మ్యాచ్‌లు, కడపలో ఏడు మ్యాచ్‌లు ఆడే విధంగా షెడ్యూల్ రూపొందించామన్నారు. జట్ల ఎంపికకు సంబంధించి నిర్వహిస్తున్న వేలంలో 452 మంది ఆటగాళ్ల సిద్ధంగా ఉన్నారని, వారిని నాలుగు కేటగిరీలుగా విభజించామన్నారు. ఏసీఏ పరిధిలోని ఆటగాళ్ల గణాంకాలను ఎప్పటికప్పుడు పొందుపరిచేందుకు స్పోర్ట్సు మెకానిక్ అనే కొత్త సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్సు ఛానెల్‌లో తెలుగులో కూడా ప్రత్యక్ష ప్రసారం అయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. సీజన్-3 ద్వారా మరుగున పడిన ఆటగాళ్లకు ఉన్నత స్థాయి టోర్నీలలో అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏసీఏ, ఏపీఎల్ ప్రతినిధులు చలం, నవనీత్‌కృష్ణ, జితేంద్రనాథ్, ఎంఎస్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

డాబాగార్డెన్స్, మే 16: పెదగంట్యాడ మండల పరిధిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వై.సందీప్‌కు సంజీవని నిధి (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ డి.హుస్సేన్‌సాహెబ్ గురువారం సందీప్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. ఏపీ రెవెన్యూ జిల్లా అసోసియేషన్ తరఫున అధ్యక్షులు ఎస్.ఎ.త్రినాథరావు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబసభ్యుల చెంతకు మానసిక రోగి

అక్కయ్యపాలెం, మే 16: నిరాశ్రయుల వసతి గృహం లో ఆశ్రయం పొందుతున్న మానసిక రోగి బసుమతి (35)ని ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో పశ్చిమ బెంగాల్, నదియా జిల్లాలోని మొల్లా బెలియా గ్రామానికి చెందిన కుమారుడు, కుమార్తెకు సమాచారం ఇచ్చామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ శ్రీనివాసు తెలిపారు. తల్లిని అప్పగించినందుకు కుమారుడు గోపాల్ మండల్ ధన్యవాదాలు తెలిపారు.

ఓటు..నోటు

... 5వ పేజీ తరువాయి

ఉచిత సలహా ఇచ్చారు. ఇలా అన్ని పార్టీలు ప్రచారం చేయడంతో డబ్బులు తీసుకోకపోతే..అవి ఇంకొకరి జేబుల్లోకి వెళతాయే తప్ప ఇచ్చిన వ్యక్తి వద్దకు వెనక్కి వెళ్లవని భావించిన ఓటర్లు సంశయించకుండా డబ్బులు తీసుకున్నారు.

సమస్యలపై ఈ ఐక్యత ఏదీ?

ఓటుకు నోటు అందలేదని కార్యాలయానికి, ఇంటికి వెళ్లి నిలదీసిన ఓటర్లు..ఫలానా సమస్య పరిష్కరించలేదని ప్రశ్నించడానికి ఏనాడూ నాయకుల వద్దకు వెళ్లకపోవడం గమనార్హం. డబ్బుల కోసం గుంపులుగా వెళ్లినవారు స్థానిక సమస్యలపై కూడా అలాగే నిలదీస్తే బాగుండేది. అటువంటి చైతన్యం ఎప్పుడు వస్తుందా? అని సమాజం ఎదురుచూస్తోంది.

నత్తనడకన గ్యాస్ పైప్‌లైన్

... 5వ పేజీ తరువాయి

తమకు ఉందని తెలిపింది. మరోవైపు గెయిల్ కూడా శ్రీకాకుళం-విశాఖపట్నం మధ్య పనులు తమకు అప్పగించాలని కోరుతోంది.

గాజువాక వరకు వచ్చింది

కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టిన ప్రాజెక్టు పనులు గాజువాకలో గత ఏడాదే పూర్తయ్యాయి. దాంతో అక్కడ సుమారు ఐదు వేల ఇళ్లకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ దీనికి ఏర్పాట్లు చేసింది. అప్పటి వరకు సిలెండర్ల ద్వారా ఇళ్లకు లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరా చేశారు. ఏడాది నుంచి ఎల్‌పీజీకి బదులుగా 'నేచురల్ గ్యాస్' సరఫరా చేస్తున్నారు. దీనిని 'పీఎన్‌జీ'గా వ్యవహరిస్తారు. ఈ కనెక్షన్‌లో సిలెండర్ ఉండదు. ఇంటి వరకు భూగర్భం ద్వారా పైప్‌లైన్ వేస్తారు. అక్కడి నుంచి ప్రత్యేకమైన పైపుల ద్వారా ఇంటిలోని కిచెన్‌కు కనెక్షన్ ఇస్తారు. గ్యాస్ వినియోగాన్ని కిలోల లెక్కన కాకుండా కిలో క్యాలరీల లెక్కన బిల్లింగ్ చేస్తారు. ఇది పోస్ట్ పెయిడ్ కనెక్షన్. విద్యుత్ బిల్లులా నెల తరువాత ఎంత వాడితే అంత కట్టాల్సి ఉంటుంది. కనెక్షన్‌కు మీటరు ఉంటుంది. దాని ద్వారా ఎంత గ్యాస్ ఉపయోగించిందీ లెక్కిస్తారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లకే కాకుండా వ్యక్తిగత గృహాలకు కూడా ఈ కనెక్షన్లు ఇస్తారు. ఈ విధంగా గ్యాస్ తీసుకునే వారికి రాయితీ ఏమీ ఉండదు. ఈ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం ఆగిపోయాయి. తిరిగి ఎవరో ఒకరు చేపట్టే వరకు విశాఖ ప్రజలకు ఈ సౌకర్యం అందుబాటులోకి రాదు.

జోరుగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

స్థానాలపై కూడా పందాలు సాగుతున్నాయి. ఏడుకు మించి రావని పలువురు బెట్టింగ్ కాస్తున్నారు. ఇది వచ్చే నెల నాలుగో తేదీ నాటికి మరింత తారస్థాయికి చేరే అవకాశం ఉందని రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాల్లో వైసీపీ గెలుపుపై ఎవరూ బెట్టింగ్ కాసేందుకు రావడం లేదని అంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 22,763

... 5వ పేజీ తరువాయి

జిల్లాల్లో ఓటున్న 5,005 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వారు ఓట్లను ఆయా జిల్లాలకు పంపారు. జిల్లాలో ఓటున్న వారి పోస్టల్ బ్యాలెట్‌లు స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఇక ఈనెల ఏడు, ఎనిమిది తేదీల్లో ఇంటి వద్ద 1,478 మంది వృద్ధులు, 830 మంది విభిన్న ప్రతిభావంతులు మొత్తం 2,308 మంది ఓటు వేశారు. జిల్లాలో సుమారు మూడు వేల మంది సర్వీస్ ఓటర్లలో ఎంత మంది ఓటు హక్కు వినియోగించుకున్నారనే సమాచారం ఇంకా అందలేదు.

వ్యాపార కేంద్రాలుగా రైతుబజార్లు

... 5వ పేజీ తరువాయి

విధంగా అమ్మాలని చెబుతూ అధిక రేట్లు పెట్టి అమ్మిస్తున్నారు. వీటి కోసం సిబ్బంది రవాణా, ప్యాకింగ్ ఖర్చులు భరించాల్సి వస్తోంది.

మేము ఏమైపోవాలని వ్యాపారుల ఆందోళన

రైతుబజార్ల సిబ్బందితో విజయ బ్రాండ్ ఆయిల్, మార్క్‌ఫెడ్ తరఫున శెనగపప్పు, ఇప్పుడు మార్కెటింగ్ శాఖ తరఫున జీడిపప్పు, వేరుశెనగ, కారం, పసుపు అమ్మిస్తున్నారు. వారే అన్నీ అమ్ముతున్నప్పుడు ఇక తమ దగ్గర ఎవరు కొంటారని ఇతర వ్యాపారులు వాపోతున్నారు. నెలకు రూ.15 వేలు అద్దె కట్టి కిరాణా వ్యాపారం చేసుకుంటున్నామని, తమ వ్యాపారాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు సిబ్బంది కూడా తమకు ఈ అమ్మకాల బాధ్యతలు తప్పించాలని కోరుతున్నారు.

అక్కడ ఓట్లు 34...పోలైంది 23

... 5వ పేజీ తరువాయి

సంఖ్య 34, 801 నుంచి 900 వరకు ఓట్లు పోలైన బూత్‌ల సంఖ్య 22, 901 నుంచి 1000 ఓట్ల వరకు పోలైన బూత్‌ల సంఖ్య ఏడుగా ఉంది. మురికివాడలు, వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్కువగా ఓటింగ్ జరిగింది. అచ్చెంపేట జీవీఎంసీ పాఠశాలలో బూత్ నంబరు 199లో 1,365 మంది ఓటర్లలో 986 మంది (74.35 శాతం) ఓటు వేశారు. చాలా బూత్‌లలో ఓట్ల సంఖ్య వెయ్యికి మించి ఉండడంతో క్యూలో నిలబడలేక కొందరు ఓటు వేయలేదు. వన్‌టౌన్‌లో ఎక్కువమంది సొంత గ్రామాలకు వెళ్లడం ఓటింగ్ తగ్గడానికి కారణమని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు పోలింగ్ 60 శాతం దాటలేదని, ఈసారి 63.42 శాతానికి పెరిగిందని అంటున్నారు. ఉద్యోగులు, ఉన్నత వర్గాలున్న అఫీషియల్ కాలనీ, న్యూకాలనీ, డాబాగార్డెన్స్, కృష్ణానగర్ ప్రాంతాల్లో తక్కువమందే ఓట్లు వేశారు.

ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దు

- కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలి
- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ

విజయనగరం క్రైం, మే 16: ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దని, కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ అధికారులను ఆదేశించారు. గురువారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయం లోని సమావేశ మందిరంలో రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీ పురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికా రులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పు డు ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా, క్షేత్రస్థాయి లో సమర్థంగా సిబ్బంది విధులు నిర్వహించడంతో చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. మరో 18 రోజులు ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేయాలని ఆదేశించారు. ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రాలు వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. వివాదాలకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే నెల 4న కౌంటింగ్ నిర్వహించే కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం ఎస్పీ దీపిక, పార్వతీపురం-మన్యం ఎస్పీ విక్రాంత్ పాటిల్, శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ, అల్లూరి సీతారామరాజు ఎస్పీ తుషాంత్ సిన్హా, అదనపు ఎస్పీలు అస్మాపరహీన్, ప్రేమ్ కాజల్, దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, ట్రైనీ ఐపీఎస్ జావలి, డీఎస్పీలు శ్రీని వాసరావు, గోవిందరావు, చక్రవర్తి, మురళీధర్, జీవీ కృష్ణారావు, అప్పలరాజు, అప్పారావు, కేవీ సత్యనారాయణ, బాలచంద్రారెడ్డి, సునీతా, నాగేశ్వరరెడ్డి, ట్రైనీ డీఎస్పీలు మహీంద్ర, రాజా, సీఐలు పాల్గొన్నారు.

'దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రం'

మురళీనగర్, మే 16: రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఖ్యాతి సీఎం జగన్‌కే దక్కుతుందని వైసీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కొనియాడారు. గురువారం పార్టీ శ్రేణులతో 50వవార్డు బిర్లా జంక్షన్‌లోని ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుతో నంబర్ వన్‌గా నిలిపారని, మిగిలిన రాష్ట్రాల సీఎంలు రాష్ట్రం వైపు చూసేలా చేశారన్నారు. నగరాన్ని ప్రభుత్వం అగ్రగామిగా తీర్చిదిద్దిందన్నారు. ఈ ఎన్నికల్లో అంతా సమష్టిగా పనిచేసి ఉత్తర నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపినందుకు పార్టీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు రమణికుమారి, ఉడా మాజీ ఛైర్మన్ రవిరాజు, కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు, మహిళా కార్యకర్తలు, పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలేనా?

అందుబాటులో ఫైర్ స్టేషన్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెందుర్తి పరిసరాల్లో అగ్ని ప్రమాదాలు వాటిల్లితే సబ్బవరం, మర్రిపాలెం నుంచి శకటాలు వచ్చేసరికి నష్టం భారీగా ఉంటుందని స్థానికుల గగ్గోలు

పెందుర్తి, మే 16: ప్రభుత్వాలు మారుతున్నా పెందుర్తిలో మాత్రం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలగానే మిగిలిపోతుంది. పరిపాలన వికేంద్రీకరణ కోసం కొత్తగా విశాఖ జిల్లాలో పెందుర్తి మండలాన్ని ఉంచినప్పటికీ ఫైర్ స్టేషన్‌ను మాత్రం ఏర్పాటు చేయకపోవడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 పంచాయతీలు, ఎనిమిది వార్డులతో 2.5 లక్షల జనాభా గల నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పెందుర్తిలో అగ్నిమాపక కేంద్రాన్ని (ఫైర్ స్టేషన్) ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. గ్రామీణ, పట్టణ ప్రాంతం మిళితమైన పెందుర్తిలో పరిశ్రమలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, హోటళ్లు, బహుళ అంతస్థులు ఉన్నాయి. దీంతో పాటు గ్రామాలు, వార్డుల్లో ఇప్పటికీ చాలా పూరిళ్లు ఉన్నాయి. ఇక వ్యవసాయపరంగా సరుగుడు, ఆకేశా, టేకు, చెరకు తోటలు సాగులో ఉన్నాయి. దురదృష్టవశాత్తు ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే జరిగే నష్టానికి బాధ్యులెవరన్నది ప్రజాప్రతినిధిలు, అధికారులు యోచించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయ పడుతున్నారు.



గుర్రమ్మపాలెం గొడౌన్ దగ్ధమవుతున్న దృశ్యం (ఫైల్)



పెందుర్తిలో ప్రమాదం వాటిల్లితే సబ్బవరం నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం (ఫైల్)

పెందుర్తిలో జరిగిన భారీ అగ్ని ప్రమాదాలు

ఇటీవల పాత పెందుర్తిలోని సాలిపేటలో ఉన్న రెండంతస్థుల భవనంలో ప్లాస్టిక్ సామగ్రి విక్రేత ఇంట్లో అగ్ని ప్రమాదం జరగడంతో ప్లాస్టిక్ సామగ్రి కాలిపోయి సుమారు రూ.పది లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. అలాగే ఇక్కడి పీఎస్ఎల్ కంపెనీ సమీపంలోని గుర్రమ్మపాలెంలో ఇండస్ట్రియల్ జోన్ రహదారిని ఆనుకుని ఉన్న గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించి దాదాపు మూడు వేల కుర్చీలు, ఇతర సామగ్రి ధ్వంసమై సుమారు రూ.పది లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. సుజాతనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్లో అగ్ని ప్రమాదం కారణంగా మంటలు చెలరేగడంలో సుమారు మూడు లక్షల రూపాయల విలువైన గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. అంతేకాక దొగ్గవానిపాలెంలోని ఓ అపార్ట్‌మెంటులోని ఫ్లాట్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో దాదాపు రూ.పది లక్షల ఆస్తి నష్టం జరిగింది. అదేవిధంగా గుర్రమ్మపాలెం, పెందుర్తి, రాంపురం, పెదగాడి, నరవల్లో గల పలు సరుగుడు తోటల్లో అగ్ని ప్రమాదం కారణంగా తోటలు దగ్ధమయ్యాయి. వెంకటాద్రి శిఖరం, వేపగుంట, నరవ ప్రాంతాల్లోనూ అగ్ని ప్రమాదాలు సంభవించిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ఆస్తి నష్టం రూ.లక్షల్లో ఉంటుందని అధికారులు అంచానాలు వేశారు. మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా సకాలంలో మంటలను అదుపులోకి తీసుకురాకపోవడం వల్ల భారీ నష్టం వాటిల్లుతుంది. పెందుర్తి పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే సబ్బవరం, మర్రిపాలెంలో గల ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాల్సి వస్తుంది. ఆయా ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటాలు ఇక్కడకు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతుందని స్థానికులు వాపోతున్నారు. సబ్బవరం, మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రాలు ఇక్కడకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. అంత దూరం నుంచి ఫైర్ ఇంజన్లు ఇక్కడకు చేరుకునేసరికి సుమారు అర గంట పడుతుందని, సకాలంలో అగ్ని నివారణ చర్యలు చేపట్టకపోవడంతో భారీ నష్టం వాటిల్లుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా అగ్నిమాపక కేంద్రం ఉంటే ఈ దుస్థితి ఉండదని పేర్కొంటున్నారు.

గతంలో స్థలం ప్రతిపాదించినా..

గతంలో పెందుర్తిలోని విశాఖ డెయిరీ సమీపంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించి స్థల సేకరణ చేపట్టినప్పటికీ ఆ తర్వాత ఎలాంటి కదలిక లేకుండా పోయింది. మండల రెవెన్యూ పరిధిలో పలు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురై పరాధీనలో ఉన్నాయి. ఆక్రమణలకు అధికారులు అడ్డుకట్ట వేసి ఏదో ఒక స్థలంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే అగ్ని ప్రమాదాలను నియంత్రించవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బురదమయంగా మారిన కణితి రహదారి

వర్షంతో బురదమయమైన రోడ్లు

ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు తప్పని పాట్లు

గాజువాక, మే 16: గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో గురువారం ఉదయం కురిసిన వర్షానికి రహదారులన్నీ బురదమయంగా మారాయి. ఇక్కడి కణితి రోడ్డును విస్తరించేందుకు గాను ఇటీవల ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు జరిపి వదిలేశారు. దీంతో వర్షానికి ఆయా గోతుల్లో నీరు చేరడంతో పాటు ఈ మార్గమంతా బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నారు. ఈ రోడ్డులో ఏ మాత్రం అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాలు నడిపినా జారిపడడం ఖాయమని పలువురు పేర్కొంటున్నారు.

వానతో సేద తీరిన ప్రజలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు కురిసిన వర్షంతో ప్రజలు కాస్త సేద తీరారు. గత కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. చాలా రోజులకు వాతావరణంగా చల్లగా ఉందంటూ పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

వేపగుంటలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జీవీఎంసీ అధికారులు, సిబ్బంది

వేపగుంట, మే 16: జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ మలేరియా విభాగం, పారిశుధ్య అధికారులు, సిబ్బంది గురువారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇక్కడి జోనల్ కార్యాలయం నుంచి వేపగుంట కూడలి వరకు అధికారులు, సిబ్బంది, ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు.

ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో డాక్టర్ జె.కృష్ణంరాజు మాట్లాడుతూ డెంగ్యూపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రానున్నది వర్షాకాలం కావడం వల్ల ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ విభాగం సూపర్‌వైజర్ ఎస్.వి.రమణ, మలేరియా హెల్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ సత్యానంద్, నాయుడు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, మే 16: ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరానగర్, నరసింహనగర్, గణేశ్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ఏరియా, లక్ష్మీనగర్, రామకృష్ణానగర్, కొత్తపాలెం, సంతోశ్‌నగర్, నాగేంద్రకాలనీ, సూర్యనగర్, డీఏఆర్‌నగర్, గణపతినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శ్రీవారి బ్రహోత్సవాలకు శ్రీకారం



శ్రీవారి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి, మే 16: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. విష్వక్సేన. అంకురారోపణ పూజలు చేశారు. ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక జరిపాక శ్రీవారిని శోభామయంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అప్పన్న ఒలుపు చందనం విక్రయాలు ప్రారంభం

సింహాచలం, మే 16: వరాహలక్ష్మీనృసింహస్వామి ఒలుపు చందనం విక్రయాలను గురువారం నుంచి ప్రారంభించారు. ఈనెల 10న జరిగిన స్వామివారి నిజరూప దర్శనం చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామిపై నుంచి అర్చకులు తొలగించిన నిర్మాల్య చందనం విక్రయాలను ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు ఏఈఓ నక్క ఆనందకుమార్ పర్యవేక్షణలో విక్రయాలను ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు విక్రయాలు ప్రారంభం కాగా అప్పటికే పెద్ద సంఖ్యలో భక్తులు బారులుతీరారు. ఏఈఓతో పాటు పర్యవేక్షణాధికారి వెంకటరమణ స్వయంగా ప్రసాదాల విక్రయ కేంద్రానికి వెనుక భాగంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. తొలిరోజు సుమారు వెయ్యి పేకెట్లు ఒక్కొక్కటి రూ.10 చొప్పున విక్రయించారు. అలాగే ఈనెల 17, 19, 20, 21 తేదీల్లో కూడా చందన ప్రసాదాల విక్రయాలు కొనసాగుతాయని అధికారులు ప్రకటించారు.

బాక్సింగ్ క్రీడాకారులకు డైట్ ఫుడ్ పంపిణీ

మల్కాపురం, మే 16: క్రీడల పట్ల దృష్టిసారించడంతో పాటు లక్ష్యాల సాధనకు కృషి చేస్తే అనుకున్న ఫలితాలను సాధించవచ్చని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ పేర్కొన్నారు. శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్ మైదానంలో మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులకు సంఘ సేవకులు జీజేపీ రాజు దంపతులు గురవారం ఉదయం డైట్ ఫుడ్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సురేశ్ మాట్లాడుతూ బాక్సింగ్‌లో మెలకువలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐజీ క్వార్టర్స్ పెద్దలు బంగార్రాజు, సత్యారావు, మైక్ టైసన్ క్లబ్ ప్రతినిధులు పోతిన ప్రసాద్ పాత్రుడు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో వైసీపీ నాయకుడి అరెస్టు

పద్మనాభం, మే 16: అమాయక రైతులను మోసం చేసి వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన భూ పరిహారాన్ని కాజేసిన కేసులో వైసీపీ నాయకుడిని పద్మనాభం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రేవిడిలో జగనన్న లేఅవుట్ వేయడానికి గ్రామానికి చెందిన పిల్లి గురువులు, చుక్క అప్పయ్యమ్మ, కొల్లి రాములమ్మ, తదితరుల వద్ద ప్రభుత్వం సుమారు రెండు ఎకరాల భూమి తీసుకొని వారికి ఒక్కొక్కరికి రూ.42 లక్షల చొప్పున ముగురికి రూ.1.26 కోట్లు మంజూరు చేసి వారి ఖాతాలకు నగదు బదిలీ చేసింది. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు కోన రమణ, మజ్జి శంకరరావు లబ్ధిదారులకు మాయ మాటలు చెప్పి వారి బ్యాంకు ఖాతాల నుంచి తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను బదిలీ చేయించుకోవడం ద్వారా రూ.80 లక్షలు కాజేశారు. దీనిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు బాధితులు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో మధురవాడ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు పద్మనాభం సీఐ శ్రీధర్ కేసు దర్యాప్తు చేపట్టి ఎట్టకేలకు కోన రమణను అరెస్టు చేసి భీమిలి కోర్టుకు తరలించారు. మరో వైసీపీ నాయకుడు మజ్జి శంకరరావు పరారీలో ఉన్నాడు. ఆయన కోసం పద్మనాభం పోలీసులు గాలిస్తున్నారు.



కనకాంబరాలతో అలంకృతులైన వేంకటేశ్వరస్వామి

ఎస్టీబీఎల్‌లో శ్రీవారికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, మే 16: వైశాఖమాసం సందర్భంగా గురువారం షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా శ్రీవారిని పంచామృతాలతో అభిషేకించిన వేదపండితులు భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చిన కనకాంబరాలతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ఉదయం భక్తులకు స్వామివారి నేత్రదర్శన భాగ్యాన్ని, సాయంత్రం శ్రీవారి పాద దర్శనాన్ని కల్పించారు. పూజాది కార్యక్రమాల్లో పాలక మండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగనంపూడిలో సాయినాథునికి..

అగనంపూడి: ఇక్కడి షిర్డీసాయి బాబా ఆలయంలో స్థానిక షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలు, పుష్పాలతో సాయినాథున్ని అలంకరించగా, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో విష్ణు, లలితాసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యనారాయణ, లీలావతి, పవన్, సత్యలక్ష్మి, పంకజం, సూరీడమ్మ, పద్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 36, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 26, క్యారెట్ 36, దొండకాయలు 27, బంగాళదుంపలు 28, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 146, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 38, కీర దోస 30, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 66, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	138
ఫారం ధర	--	158
విత్ స్కిన్	--	286
స్కిన్‌లెస్	--	296

రాన్నునది రామరాజ్యం

జగన్ సైకో పాలనకు ప్రజలు ఓటు రూపంలో స్వస్తి పలికారు

తెలుగుదేశం పార్టీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మే 16: రానున్నది రామరాజ్యమని, జగన్ సైకో పాలనకు ప్రజలంతా ఓటు రూపంలో స్వస్తి పలికారని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్లంతా చైతన్యవంతులై కూటమిని గెలిపించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇక్కడి గాజువాక క్లబ్‌లో గురువారం జరిగిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు నెలలుగా కూటమి శ్రేణులు ఎంతో శ్రమించారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనలో విసిగిపోయిన ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. రానున్న ఫలితాలతో వైసీపీ చాప చుట్టేస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడనున్న జూన్ నాలుగో తేదీన రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో కోన తాతారావు, కరణంరెడ్డి ఉన్నారు



'పల్లా'తో రౌతు శ్రీనివాసరావు, తదితరులు

'పల్లా'ను కలిసిన టీడీపీ నాయకులు

అగనంపూడి: టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును 79వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వార్డు పరిధిలోని ఓటింగ్ శాతాన్ని వివరించడంతో పాటు గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. పల్లాను కలిసిన వారిలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, నాయకులు కరణం సత్యారావు, జగదీశ్, సింగిడి సింహాచలం, కనకభవానీ, ఎం.వెంకటరావు, పి.నాగేశ్వరావు, రుద్రకుమార్, తదితరులు ఉన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో వైసీపీ కార్పొరేటర్ బంధువుల వాగ్వాదం

నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయ నిర్మాణ పనులు చేపట్టడంతో అడ్డుకున్న సిబ్బంది

ప్లాన్ ప్రకారమే నిర్మాణం చేపట్టామన్న కార్పొరేటర్ బంధు గణం

పెందుర్తి, మే 16: జీవీఎంసీ 97వ వార్డు పరిధి చినముషిడివాడ సప్తగిరినగర్ బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలో 95వ వార్డు వైసీపీ కార్పొరేటర్ బంధువులకు చెందిన వాణిజ్య సముదాయ నిర్మాణం వద్ద వివాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇక్కడ నిర్మాణం చేపట్టారంటూ గతంలో టీడీపీ నాయకులు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు చేయడం. అప్పట్లో వివాదం జరగడంతో అధికారులు పనులు నిలిపివేశారు. కాగా గురువారం కార్పొరేటర్ బంధువులు మళ్లీ నిర్మాణ పనులు చేపట్టారు. వాణిజ్య సముదాయం కింద ఫ్లోర్‌లోని షాపులకు షటర్లు బిగించేందుకు యత్నించారు. దీనిపై టీడీపీకి చెందిన 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారంటూ ఇరు శాఖల సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిర్మాణ పనులను అడ్డుకోవడంతో వివాదం చోటుచేసుకుంది. తమ కుటుంబానికి దఖలు పడిన ఈ స్థలాన్ని కోర్టును ఆశ్రయించి వారి ఉత్తర్వుల ఆధారంగా ప్రభుత్వ మార్కెట్ ధరను చెల్లించి రిజిస్ట్రేషన్ ద్వారా ఈ స్థలానికి హక్కులు పొందామని వైసీపీ కార్పొరేటర్ బంధువులు తెలిపారు. అంతేకాక ప్లాన్ తీసుకుని నిర్మాణ పనులు చేపట్టామని, అందుకు సంబంధించిన పత్రాలను చూపించి వాదనకు దిగారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారని, అందుకే పనులను అడ్డుకున్నామని జోన్-8 టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వివాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అయితే ఈ నిర్మాణానికి సంబంధించి అనుమతులు పొందిన తర్వాతే పనులు చేపట్టాలని, అప్పటివరకు నిర్మాణాన్ని చేపట్టరాదని నోటీసులు జారీ చేయనున్నట్టు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తెలిపారు



టౌన్ ప్లానింగ్ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న కార్పొరేటర్ బంధువులు

స్టీల్‌ప్లాంటుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామనడం భావ్యం కాదు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, మే 16: విద్యుత్ బిల్లులను తక్షణమే చెల్లించకపోతే స్టీల్‌ప్లాంటుకు సరఫరా నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ అధికారులు నోటీసులు జారీ చేయడం భావ్యం కాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,190వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తే స్టీల్‌ప్లాంటులో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఎంతోమంది త్యాగాలతో ఏర్పడిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ కానివ్వబోమని, ప్లాంట్ పరిరక్షణే తమ ధ్యేయమన్నారు.

నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు కార్మికులంతా వినూత్న పంథాలో ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. ఇప్పటికైనా కేంద్రం ఉక్కు ప్రైవేటీకరణ యోచనను విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

'ఉక్కు' కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం

ఉక్కుటౌన్‌షిప్: ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు ఎలాంటి పోరాటాలకైనా తాము సిద్ధమని డీవీఆర్ఈఎస్‌యూ ప్రధాన కార్యదర్శి డీవీ రమణారెడ్డి అన్నారు. సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు గల్లా శంకర్ సాయిరాం, నూకరాజు, అప్పారావు, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక ప్రయోజనాలకు గండి కొడితే సహించం'

ఉక్కుటౌన్‌షిప్, మే 16: స్టీల్‌ప్లాంట్ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు గండికొడితే సహించబోమని హెచ్ఎంఎస్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి అన్నారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం సంస్థ అభివృద్ధిపై, కార్మిక ప్రయోజనాలపై దృష్టిసారించాలని కోరారు. ప్లాంట్ ప్రగతికి, కార్మిక ప్రయోజనాల కోసం యాజమాన్యం చేపట్టే చర్యలకు యూనియన్ తరఫున తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. నాయకులు డి.అప్పారావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణం చేసిన మానవ హక్కుల సంఘం సభ్యులు

అగనంపూడి, మే 16: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని సీడబ్ల్యూసీ ప్రాంగణంలో మానవ హక్కుల సంఘం సభ్యులుగా నియమితులైన దాసరి జయలక్ష్మి, ఉషారాణి, లక్ష్మీప్రభ, పైలా లక్ష్మి, సాగి జగదీశ్వరి, ఆర్.పార్వతిలతో సంఘం ఉత్తరాంధ్ర రీజనల్ చైర్మన్ ఎలుగుబంటి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతానికి సభ్యులంతా కృషి చేయాలన్నారు. కార్యమంలో సంఘం జిల్లా చైర్మన్ మోటూరి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, విందుల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ

పెదగంట్యాడ, మే 16: కథ రాయడానికి ముందు ఇతివృత్తాన్ని ఎంపిక చేసుకోవాలని, అది సామాజిక స్థితిగతులను ప్రతిబింబించేలా ఉండాలని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా మెదడుకు పదును పెట్టేలా ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో నడుపూరు ఉన్నత పాఠశాల, నెల్లిముక్కు మోడల్ యూపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



పార్కులో వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చకచకా సాగుతున్న పంచతత్వ పార్కు పనులు

ఎన్.ఎ.డీ. జంక్షన్, మే 16: జీవీఎంసీ 90వ వార్డు పరిధి బాజీ జంక్షన్ సంత వెనక లక్ష్మీనగర్‌లో చేపట్టిన పంచతత్వ పార్కు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ జిమ్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పార్కులో వాకింగ్ ట్రాక్, గార్డెన్, బ్యాడ్మింటన్ కోర్టు, తదితర అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ పార్కును నిర్మించాలంటూ 90వ వార్డు రెసిడెంట్స్ ఆదర్శ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కొన్నేళ్లుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసిన నేపథ్యంలో పంచతత్వ పార్కును రూ.19.80 లక్షలతో నిర్మిస్తున్నారు. ఎన్నికల ముందే నిర్మాణానికి శంకుస్థాపన చేసినందున ప్రసుత్తం పనులు చకచకా సాగుతున్నాయి. జోన్-8 వర్క్ ఇన్‌స్పెక్టర్లు మదన్, సాయి ఇక్కడి పనులను పరిశీలించారు. మరో మూడు వారాల్లోగా పనులు పూర్తవుతాయని, అనంతరం పంచతత్వ పార్కు ప్రజలకు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ పార్కు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్, కొండవాలు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పూర్ణామార్కెట్, మే 16: వన్‌టౌన్‌లోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అధికారులు, అర్చకులు త్రికాల పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. ఉభయ దాతలతో అర్చకులు అభిషేక సేవలను జరిపించారు. ఈ పూజల్లో పాల్గొన దలచిన భక్తులు టికెట్ తీసుకుని పాల్గొనవచ్చని ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కాగా అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ఉచిత అన్న ప్రసాద వితరణ జరిగింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మే 16: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం చర్యలు చేపడుతున్నట్టు ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పాపా హోమ్‌ఏరియా, ప్రెసిడెన్షియల్ స్కూల్ ఏరియా, వెలమభవన్ ఏరియా, బీఎస్ లే అవుట్ ఏరియా, హిల్‌వ్యూ పార్క్ ఏరియా, రాకెట్ పార్క్ ఏరియా, ఏఎస్ఆర్‌నగర్ ఏరియా, వోల్వో ఆఫీస్ ఏరియా, ఏఎస్ఆర్‌నగర్, సబ్బంహరి ఇల్లు ఏరియాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

19 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

మురళీనగర్, మే 16: మురళీనగర్ శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో బండారు ప్రసాద్, అర్చకులు శేషు స్వామి తెలిపారు. ఈనెల 19న ఉదయం 5 గంటలకు అంకురార్పణ, పతాక ప్రతిష్ఠ విశేష హోమం జరుగుతుంది. సాయంత్రం ఐదు గంటలకు ఎదురు సన్నాహోత్సవం, 6 గంటలకు 'శ్రీవారి కల్యాణ మహోత్సవం" చేస్తామన్నారు. 20న లక్ష మల్లెల అర్చన, సదనోత్సవం, 21న వసంతోత్సవం, పూర్ణాహుతి, ఊంజల్ సేవ, 22న తిరువీధి, 23న పంచామృతాభిషేకం అనంతరం భక్తులకు వజ్ర కవచంతో శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు ఈవో తెలిపారు.



ప్రమాదకర పరిస్థితిలో జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులు



మధ్యలో నిలిచిపోయిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

ప్రమాదాలకు నిలయం కప్పరాడ జంక్షన్

- కొండవాలు ప్రాంత వాసులకు ఏకైక మార్గం
- నిత్యం ప్రమాదాలు.. పలువురు మృత్యువాత
- ఫుట్‌ఓవర్ నిర్మాణంపై అలసత్వం

కంచరపాలెం, మే 16: గ్రేటర్ 46, 47,48 వార్డుల పరిధిలోని కొండవాలు ప్రాంతాల ప్రజలు కంచరపాలెం మెట్టు మీదుగా ప్రయాణించాలంటే ప్రాణ సంకటంగా మారింది. వీరంతా జాతీయ రహదారిని కప్పరాడ జంక్షన్ వద్ద దాటాల్సి రావడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోననే భయాందోళన చెందుతున్నారు. ఈజంక్షన్ వద్ద పాదచారులు, వాహనదారులు దాటే ప్రయత్నంలో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్ వద్ద రోడ్డు క్రాస్ చేసే ప్రయత్నంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక బీట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పాదచారులకు దిక్సూచిగా నిలిచేవారు. అయితే, ఇటీవల ప్రత్యేకంగా ట్రాఫిక్ సిబ్బంది కనిపించకపోవడంతో పాదచారులు, విద్యార్థులు నిత్యం రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడి సమస్యకు జీవీఎంసీ అధికారులు, పాలకులు పరిష్కారం చూపాల్సి ఉంది.

ఏళ్లుగా నిలిచిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు

గతంలో ఇక్కడ హైవేను దాటడానికి కొండవాలు గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పనులను ప్రారంభించారు. భారీ స్థాయిలో 15 ఏళ్ల కింద చేపట్టిన పనులు పునాదుల దశ వరకు నిర్మాణాలను శరవేగంగా పూర్తిచేసి అనంతరం వదిలేశారు. అప్పటినుంచి పాదచారులు రోడ్డును దాటే వెసులుబాటు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బ్రిడ్జి నిర్మాణం విషయంలో రాజకీయ నాయకులు పూర్తిస్థాయిలో చొరవచూపాల్సిన అవసరం ఉంది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తరువాత అయినా స్థానిక ఎమ్మెల్యే ఇక్కడి సమస్యపై దృష్టి సారించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు, పనులు సత్వరం పూర్తిచేయాలని ప్రజలు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విశాఖలో చెవిరెడ్డి స్కామ్ రూ.వెయ్యి కోట్లు

- జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి యాదవ్

సీతమ్మధార, మే 16: నిత్యం దైవ నామ స్మరణంలో ఉన్నట్టు కనిపించే వైసీపీ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విశాఖకు రూ.వెయ్యి కోట్లకు పైగా పంగనామం పెట్టారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. సీఎం జగన్‌ను హిందువులు వ్యతిరేకించకుండా ఆయన ఇంట్లో గోశాల ఏర్పాటు చేసి పదేపదే ఆలయ సెట్లు నిర్మించి, ఆ పలుకుబడితో విశాఖలో భారీ స్కాములు చేసేశారన్నారు. బినామీలతో రుషికొండను విధ్వంసం చేయించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్కడి ఎర్రమట్టిని మాత్రం విశాఖ పోర్టుకు తరలించి భారీగా లబ్ధి పొందారన్నారు. ఈ సమావేశంలో జనసేన చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, నాగలక్ష్మి చౌదరి, టీడీపీ నేత పోతనరెడ్డి, పోతు వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

20 నుంచి పరదేశమ్మ అమ్మవారి పండగ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

అక్కయ్యపాలెం, మే 16: తాటిచెట్లపాలెంలోని పరదేశమ్మ అమ్మవారి పండగ ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్నట్టు శ్రీ పరదేశమ్మ గ్రామ సేవా సమితి అధ్యక్షుడు సదరం ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయ ఆవరణలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20న తొలేళ్లు, 21న ప్రధాన పండగ నిర్వహిస్తామన్నారు. అలాగే 28వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు మారువారం సందర్భంగా సారె ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డేటి జగత్‌రావు, సెక్రటరీ బోర అప్పలరెడ్డి, కోశాధికారి కొత్తపల్లి నాగేశ్వరరావు, ఆడిటర్ సీరపు నాగేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు నూనెల పోలారావు, యడ్ల శ్రీనివాసరెడ్డి, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్, మే 16: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 18 నుంచి 21 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వస్తున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు డాక్టర్ కే.ఎం.ఉన్నికృష్ణన్ నాయర్ చర్మవ్యాధులు, ఆందోళన, మానసిక ఒత్తిడి, నిద్ర లేమి, తదితర సమస్యలతో బాధపడే వారికి చికిత్స అందిస్తారన్నారు. వివరాలకు 76758 61446 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి ఎర్నిమాంబ ఉత్సవాలు

జ్ఞానాపురం: జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి మహోత్సవాలు ఈ నెల 18, 19 తేదీల్లో జరపనున్నట్లు ఈవో తెలిపారు. 18న తొలేళ్లు, అమ్మవారి ప్రతిమల ఊరేగింపు, 19న ప్రధాన పండగ జరుగుతుందని చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి దేవాలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన, 25న అన్న ప్రసాద వితరణ చేస్తామన్నారు.

టికెట్ తనిఖీలలో వాల్తేరు రికార్డు

విశాఖపట్నం: టికెట్ తనిఖీలలో వాల్తేరు రైల్వే కమర్షియల్ శాఖ రికార్డు నెలకొల్పిందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఏప్రిల్‌లో విస్తృత డ్రైవ్‌లతో జరిమానాల ద్వారా రూ.2.8 కోట్ల ఆదాయాన్ని సమకూర్చారన్నారు. గతంతో పోల్చితే ఒక నెలలో జరిమానాల ద్వారా ఆర్జించిన అత్యధిక ఆదాయం ఇదే కావడం విశేషమన్నారు.

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నాలుగోతేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆర్వోలు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంల తరలింపు, ఇతర సాంకేతిక ప్రక్రియల పూర్తి, తదితర అంశాలను ఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో చేపట్టిన చర్యలు సంతృప్తికంగా ఉన్నాయని, సమష్టి కృషితో అధికారులంతా సేవలందించారన్నారు. ఇదే ఒరవడి ఓట్ల లెక్కింపులోనూ కొనసాగాలన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతాపరమైన ఏర్పాట్లపై రోజువారీ సమీక్షించుకోవాలని ఆర్వోలను ఆదేశించారు. ప్రతిరోజు స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించి రావాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో రోజూ సంప్రదించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లను నిర్ణీత సమయంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరవేయాలని, భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్లను వేరుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయానికి ఎలాంటి సాంకేతిక అంశాలు పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. ఓట్లలెక్కింపు సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. సమన్వయంతో పనిచేసి ఫలితాల వెల్లడిలో గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచుకుని, కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంతవర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనకుమార్, ఆర్వోలు పాల్గొన్నారు.

బర్మాక్యాంప్ దాడిలో గాయపడిన వారికి గండి బాబ్జీ పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, తదితరులు

మాధవధార, మే 16: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేశారన్న అక్కసుతో కుటుంబసభ్యులపై చొరబడి వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ విమర్శించారు. ఉత్తర నియోజకవర్గంలోని 49వవార్డు బర్మాక్యాంపు నూకాంబిక ఆలయం వెనుక ఈ అమానుష ఘటన జరిగిందన్నారు. బాధిత కుటుంబసభ్యులను గురువారం రాత్రి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్, నేతలతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. గీతం విద్యా సంస్థల ఛైర్మన్ ఎం.శ్రీభరత్ బాధితులకు వైద్యం నిమిత్తం అయ్యే ఖర్చుల్ని భరిస్తారని చెప్పారు. ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు పాల్పడడం దారుణమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రశాంత విశాఖలో వైసీపీ ఫ్యాక్షన్ రాజకీయాల్ని ప్రోత్సహిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం హయాంలో ఇలాంటి విపరీత సంఘటనలు జరిగే తావు లేకుండా కృషి చేస్తామన్నారు.

విశాఖలో హింస పెరుగుతోంది: శ్రీభరత్

విశాఖపట్నం: విశాఖలో విష సంస్కృతిని పెంచుతూ రోజురోజుకీ శాంతిభద్రతలు దిగజారుస్తున్నారని పార్లమెంటు తెలుగుదేశం అభ్యర్థి ఎం.శ్రీభరత్ వ్యాఖ్యానించారు. బర్మాక్యాంప్‌లో టీడీపీ మద్దతుదారులపై వైసీపీ నాయకులు మహిళలు అని చూడకుండా దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు శ్రీభరత్ విజ్ఞప్తిచేశారు.

దాడిలో రాజకీయ ప్రమేయం లేదు: డీసీపీ

కంచరపాలెం: బర్మాక్యాంప్‌లో నూకరత్నం, ఆమె కుటుంబసభ్యులపై దాడిచేసిన నిందితుడు లోకేష్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని వెస్ట్ సబ్ డివిజన్ డీసీపీ మేక సత్తిబాబు తెలిపారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ ఘటనలో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదన్నారు. లోకేష్ కుటుంబానికి, నూకరత్నం కుటుంబానికి మధ్య పాతగొడవలున్నాయని, ఈ నేపథ్యంలోనే దాడి జరిగిందన్నారు. ఓట్ల కోసం జరిగిన దాడిగా తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఆ విధంగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఎమ్మెల్సీ రిపోర్టు ప్రకారం లోకేష్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఏసీపీ అన్నెం నరసింహమూర్తి, సీఐ ఎస్.భాస్కరరావు, ఎస్.దివ్యభారతి పాల్గొన్నారు.

వచ్చే నెల 30 నుంచి ఏపీఎల్ సీజన్-3

- బరిలో ఆరు జట్లు...మొత్తం 19 మ్యాచ్‌లు
- వేదికలుగా విశాఖ, కడపలోని స్టేడియాలు
- వివరాలు వెల్లడించిన ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 16: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 ఛాంపియన్‌షిప్ టోర్నీ వచ్చే నెల 30 నుంచి జరగనుందని ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీకి విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం, కడపలోని క్రికెట్ స్టేడియాలను వేదికలుగా ఎంపిక చేశామన్నారు. టోర్నీలో బెజవాడ టైగర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్, కోస్టల్ రైడర్స్ వంటి ఆరు ఫ్రాంచైజర్ జట్ల మధ్య మొత్తంగా 19 మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో 12 మ్యాచ్‌లు, కడపలో ఏడు మ్యాచ్‌లు ఆడే విధంగా షెడ్యూల్ రూపొందించామన్నారు. జట్ల ఎంపికకు సంబంధించి నిర్వహిస్తున్న వేలంలో 452 మంది ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారని, వారిని నాలుగు కేటగిరీలుగా విభజించామన్నారు. ఏసీఏ పరిధిలోని ఆటగాళ్ల గణాంకాలను ఎప్పటికప్పుడు పొందుపరిచేందుకు స్పోర్ట్సు మెకానిక్ అనే కొత్త సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్సు ఛానెల్‌లో తెలుగులో కూడా ప్రత్యక్ష ప్రసారం అయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. సీజన్-3 ద్వారా మరుగున పడిన ఆటగాళ్లకు ఉన్నత స్థాయి టోర్నీలలో అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏసీఏ, ఏపీఎల్ ప్రతినిధులు చలం, నవనీత్‌కృష్ణ, జితేంద్రనాథ్, ఎంఎస్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

డాబాగార్డెన్స్, మే 16: పెదగంట్యాడ మండల పరిధిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వై.సందీప్‌కు సంజీవని నిధి (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ డి.హుస్సేన్‌సాహెబ్ గురువారం సందీప్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. ఏపీ రెవెన్యూ జిల్లా అసోసియేషన్ తరపున అధ్యక్షులు ఎస్.ఎ.త్రినాథరావు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబసభ్యుల చెంతకు మానసిక రోగి

అక్కయ్యపాలెం, మే 16: నిరాశ్రయుల వసతి గృహం లో ఆశ్రయం పొందుతున్న మానసిక రోగి బసుమతి (35)ని ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో పశ్చిమ బెంగాల్, నదియా జిల్లాలోని మొల్లా బెలియా గ్రామానికి చెందిన కుమారుడు, కుమార్తెకు సమాచారం ఇచ్చామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ శ్రీనివాసు తెలిపారు. తల్లిని అప్పగించినందుకు కుమారుడు గోపాల్ మండల్ ధన్యవాదాలు తెలిపారు.

ఓటు..నోటు

... 5వ పేజీ తరువాయి

ఉచిత సలహా ఇచ్చారు. ఇలా అన్ని పార్టీలు ప్రచారం చేయడంతో డబ్బులు తీసుకోకపోతే...అవి ఇంకొకరి జేబుల్లోకి వెళతాయే తప్ప ఇచ్చిన వ్యక్తి వద్దకు వెనక్కి వెళ్లవని భావించిన ఓటర్లు సంశయించకుండా డబ్బులు తీసుకున్నారు.

సమస్యలపై ఈ ఐక్యత ఏదీ?

ఓటుకు నోటు అందలేదని కార్యాలయానికి, ఇంటికి వెళ్లి నిలదీసిన ఓటర్లు..ఫలానా సమస్య పరిష్కరించలేదని ప్రశ్నించడానికి ఏనాడూ నాయకుల వద్దకు వెళ్లకపోవడం గమనార్హం. డబ్బుల కోసం గుంపులుగా వెళ్లినవారు స్థానిక సమస్యలపై కూడా అలాగే నిలదీస్తే బాగుండేది. అటువంటి చైతన్యం ఎప్పుడు వస్తుందా? అని సమాజం ఎదురుచూస్తోంది.

నత్తనడకన గ్యాస్ పైప్‌లైన్

... 5వ పేజీ తరువాయి

తమకు ఉందని తెలిపింది. మరోవైపు గెయిల్ కూడా శ్రీకాకుళం-విశాఖపట్నం మధ్య పనులు తమకు అప్పగించాలని కోరుతోంది.

గాజువాక వరకు వచ్చింది

కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టిన ప్రాజెక్టు పనులు గాజువాకలో గత ఏడాదే పూర్తయ్యాయి. దాంతో అక్కడ సుమారు ఐదు వేల ఇళ్లకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ దీనికి ఏర్పాట్లు చేసింది. అప్పటి వరకు సిలెండర్ల ద్వారా ఇళ్లకు లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరా చేశారు. ఏడాది నుంచి ఎల్‌పీజీకి బదులుగా 'నేచురల్ గ్యాస్' సరఫరా చేస్తున్నారు. దీనిని 'పీఎన్‌జీ'గా వ్యవహరిస్తారు. ఈ కనెక్షన్‌లో సిలెండర్ ఉండదు. ఇంటి వరకు భూగర్భం ద్వారా పైప్‌లైన్ వేస్తారు. అక్కడి నుంచి ప్రత్యేకమైన పైపుల ద్వారా ఇంటిలోని కిచెన్‌కు కనెక్షన్ ఇస్తారు. గ్యాస్ వినియోగాన్ని కిలోల లెక్కన కాకుండా కిలో క్యాలరీల లెక్కన బిల్లింగ్ చేస్తారు. ఇది పోస్ట్ పెయిడ్ కనెక్షన్. విద్యుత్ బిల్లులా నెల తరువాత ఎంత వాడితే అంత కట్టాల్సి ఉంటుంది. కనెక్షన్‌కు మీటరు ఉంటుంది. దాని ద్వారా ఎంత గ్యాస్ ఉపయోగించిందీ లెక్కిస్తారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లకే కాకుండా వ్యక్తిగత గృహాలకు కూడా ఈ కనెక్షన్లు ఇస్తారు. ఈ విధంగా గ్యాస్ తీసుకునే వారికి రాయితీ ఏమీ ఉండదు. ఈ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం ఆగిపోయాయి. తిరిగి ఎవరో ఒకరు చేపట్టే వరకు విశాఖ ప్రజలకు ఈ సౌకర్యం అందుబాటులోకి రాదు.

జోరుగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

స్థానాలపై కూడా పందాలు సాగుతున్నాయి. ఏడుకు మించి రావని పలువురు బెట్టింగ్ కాస్తున్నారు. ఇది వచ్చే నెల నాలుగో తేదీ నాటికి మరింత తారస్థాయికి చేరే అవకాశం ఉందని రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాల్లో వైసీపీ గెలుపుపై ఎవరూ బెట్టింగ్ కాసేందుకు రావడం లేదని అంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 22,763

... 5వ పేజీ తరువాయి

జిల్లాల్లో ఓటున్న 5,005 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వారు ఓట్లను ఆయా జిల్లాలకు పంపారు. జిల్లాలో ఓటున్న వారి పోస్టల్ బ్యాలెట్‌లు స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఇక ఈనెల ఏడు, ఎనిమిది తేదీల్లో ఇంటి వద్ద 1,478 మంది వృద్ధులు, 830 మంది విభిన్న ప్రతిభావంతులు మొత్తం 2,308 మంది ఓటు వేశారు. జిల్లాలో సుమారు మూడు వేల మంది సర్వీస్ ఓటర్లలో ఎంత మంది ఓటు హక్కు వినియోగించుకున్నారనే సమాచారం ఇంకా అందలేదు.

వ్యాపార కేంద్రాలుగా రైతుబజార్లు

... 5వ పేజీ తరువాయి

విధంగా అమ్మాలని చెబుతూ అధిక రేట్లు పెట్టి అమ్మిస్తున్నారు. వీటి కోసం సిబ్బంది రవాణా, ప్యాకింగ్ ఖర్చులు భరించాల్సి వస్తోంది.

మేము ఏమైపోవాలని వ్యాపారుల ఆందోళన

రైతుబజార్ల సిబ్బందితో విజయ బ్రాండ్ ఆయిల్, మార్క్‌ఫెడ్ తరఫున శెనగపప్పు, ఇప్పుడు మార్కెటింగ్ శాఖ తరపున జీడిపప్పు, వేరుశెనగ, కారం, పసుపు అమ్మిస్తున్నారు. వారే అన్నీ అమ్ముతున్నప్పుడు ఇక తమ దగ్గర ఎవరు కొంటారని ఇతర వ్యాపారులు వాపోతున్నారు. నెలకు రూ.15 వేలు అద్దె కట్టి కిరాణా వ్యాపారం చేసుకుంటున్నామని, తమ వ్యాపారాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు సిబ్బంది కూడా తమకు ఈ అమ్మకాల బాధ్యతలు తప్పించాలని కోరుతున్నారు.

అక్కడ ఓట్లు 34...పోలైంది 23

... 5వ పేజీ తరువాయి

సంఖ్య 34, 801 నుంచి 900 వరకు ఓట్లు పోలైన బూత్‌ల సంఖ్య 22, 901 నుంచి 1000 ఓట్ల వరకు పోలైన బూత్‌ల సంఖ్య ఏడుగా ఉంది. మురికివాడలు, వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్కువగా ఓటింగ్ జరిగింది. అచ్చెంపేట జీవీఎంసీ పాఠశాలలో బూత్ నంబరు 199లో 1,365 మంది ఓటర్లలో 986 మంది (74.35 శాతం) ఓటు వేశారు. చాలా బూత్‌లలో ఓట్ల సంఖ్య వెయ్యికి మించి ఉండడంతో క్యూలో నిలబడలేక కొందరు ఓటు వేయలేదు. వన్‌టౌన్‌లో ఎక్కువమంది సొంత గ్రామాలకు వెళ్లడం ఓటింగ్ తగ్గడానికి కారణమని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు పోలింగ్ 60 శాతం దాటలేదని, ఈసారి 63.42 శాతానికి పెరిగిందని అంటున్నారు. ఉద్యోగులు, ఉన్నత వర్గాలున్న అఫీషియల్ కాలనీ, న్యూకాలనీ, డాబాగార్డెన్స్, కృష్ణానగర్ ప్రాంతాల్లో తక్కువమందే ఓట్లు వేశారు.

ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దు

- కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలి
- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ

విజయనగరం క్రైం, మే 16: ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దని, కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ అధికారులను ఆదేశించారు. గురువారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయం లోని సమావేశ మందిరంలో రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీ పురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికా రులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పు డు ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా, క్షేత్రస్థాయి లో సమర్థంగా సిబ్బంది విధులు నిర్వహించడంతో చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. మరో 18 రోజులు ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేయాలని ఆదేశించారు. ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రాలు వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. వివాదాలకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే నెల 4న కౌంటింగ్ నిర్వహించే కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం ఎస్పీ దీపిక, పార్వతీపురం-మన్యం ఎస్పీ విక్రాంత్ పాటిల్, శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ, అల్లూరి సీతారామరాజు ఎస్పీ తుషాంత్ సిన్హా, అదనపు ఎస్పీలు అస్మాపరహీన్, ప్రేమ్ కాజల్, దిలీప్ కిరణ్, సునీల్ షరీన్, ట్రైనీ ఐపీఎస్ జావలి, డీఎస్పీలు శ్రీని వాసరావు, గోవిందరావు, చక్రవర్తి, మురళీధర్, జీవీ కృష్ణారావు, అప్పలరాజు, అప్పారావు, కేవీ సత్యనారాయణ, బాలచంద్రారెడ్డి, సునీతా, నాగేశ్వరరెడ్డి, ట్రైనీ డీఎస్పీలు మహీంద్ర, రాజా, సీఐలు పాల్గొన్నారు.

'దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రం'

మురళీనగర్, మే 16: రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఖ్యాతి సీఎం జగన్‌కే దక్కుతుందని వైసీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కొనియాడారు. గురువారం పార్టీ శ్రేణులతో 50వవార్డు బిర్లా జంక్షన్‌లోని ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుతో నంబర్ వన్‌గా నిలిపారని, మిగిలిన రాష్ట్రాల సీఎంలు రాష్ట్రం వైపు చూసేలా చేశారన్నారు. నగరాన్ని ప్రభుత్వం అగ్రగామిగా తీర్చిదిద్దిందన్నారు. ఈ ఎన్నికల్లో అంతా సమష్టిగా పనిచేసి ఉత్తర నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపినందుకు పార్టీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు రమణికుమారి, ఉడా మాజీ ఛైర్మన్ రవిరాజు, కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు, మహిళా కార్యకర్తలు, పాల్గొన్నారు.



పసిడి పువ్వుల మధ్య స్వామివారు

అప్పన్నకు పసిడి కుసుమార్చన

సింహాచలం, మే 16 : వరాహలక్ష్మీనృసింహస్వామికి గురువారం పసిడి కుసుమార్చన వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆలయ బేడా మండపంలో రజిత ఆస నంపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు పసిడి కుసుమాలతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, మే 17 : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జూపార్కు 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాలకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మద్దిలపాలెం : శివాజీపాలెం, జేఆర్ నగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈఈ బి. సింహాచలంనాయుడు తెలిపారు. మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, శివాలయం ఏరియా, జేఆర్ నగర్, వెంకోజీపాలెం, మంగాపురం కాలనీ, ఇసుకతోట ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

భీమునిపట్నం : మండలంలోని పాతపరదేశిపాలెం, బోయపాలెం, కాపులుప్పాడ 33 కేవీ ఫీడర్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం, మంగమారిపేట, తిమ్మాపురం, నగరపాలెం, కాపుల దిబ్బడిపాలెం ప్రాంతాలకు విద్యుత్ ఉండదన్నారు.

పద్మనాభం (రూరల్) : మండలంలోని పద్మనాభం, రైతులపాలెం ఫీడర్ల నిర్వహణ పనుల వల్ల ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. రౌతులపాలెం, రౌతులపాలెం కాలనీ, రేవిడి, బర్లపేట ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

క్షయ నియంత్రణకు టీకాలు

మధురవాడ, మే 16 : మధురవాడ పీహెచ్‌సీ పరిధిలో గురువారం క్షయ నియంత్రణ కోసం పలువురికి టీకాలు వేశారు. 18 ఏళ్లు నిండిన వారికి, వ్యాధి సోకే అనుమానితులకు వ్యాక్సిన్ వేసినట్టు వైద్య సిబ్బంది వీరబ్రహ్మం చెప్పారు.

పద్మనాభం (రూరల్) : క్షయ నివారణకు రేవిడి పీహెచ్‌సీ సిబ్బంది 18 ఏళ్లు నిండిన వారికి బీసీజీ టీకాలు వేశారు. పీహెచ్‌సీ పరిధిలోని 22 పంచాయతీల్లో ఉన్న సబ్ సెంటర్లు ద్వారా రోజుకు 50 మంది చొప్పున టీకాలు వేస్తున్నామని వైద్యాధికారిణి కె. స్వప్న తెలిపారు. గతంలో క్షయతో బాధపడిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, 60 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా టీకాలు వేసుకోవాలని చెప్పారు.

నేత్ర వైద్య శిబిరం రేపు

తగరపువలస, మే 16 : స్థానిక సాయి రవీంద్ర పాఠశాల ఆవరణలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం ఉంటుందన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి తమ వాహనంలో సింహాచలంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేస్తామని వారు చెప్పారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 24, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 36, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 46, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజ్ 26, క్యారెట్ 36, దొండకాయలు 27, బంగాళా దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 146, బరబటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 66, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	138
ఫారం ధర	--	158
విత్ స్కిన్	--	286
స్కిన్‌లెస్	--	296



గతంలో కొట్టుకుపోయిన జూట్‌మిల్లు వెనుక పాత పూనుగట్టు



గోస్తనీలో పూనుగట్టు నిర్మించాల్సిన ప్రదేశం

కలగానే పూనుగట్టు నిర్మాణం

- ప్రతిపాదనలతో సరిపెట్టిన అధికారులు
- నిధులు మంజూరులో జాప్యం
- ఉప్పు నీటితో ప్రజలకు ఇబ్బందులు

తగరపువలస, మే 16 : తగరపువలసలోని గోస్తనీ నదిలో పూను గట్టు నిర్మాణం కలగానే మిగిలింది. ఏళ్ల తరబడి ఈ సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 18 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న గోస్తనీ నదిలో సముద్రం నీరు కలవకుండా పూను గట్టు నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. కొంతకాలంగా దీన్ని తక్షణ అవసరంగా అధికారులు కూడా ప్రకటిస్తున్నారు. కానీ ఇంతవరకు నిధులు విడుదల చేయకపోవడంతో పనులు జరగడం లేదు. తగరపువలస, చిట్టివలస, కొత్తపేట, సంతపేట, నగరపాలెం, తదితర ప్రాంతాల్లోని బావుల్లో మంచినీరు ఉండడం లేదు. ఈ గ్రామాల్లో ఎక్కడ బోరు వేసినా ఉప్పు నీరు వస్తోంది. జీవీఎంసీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కూడా వాడుకలకు తప్ప తాగడానికి ఉపయోగపడడం లేదు. ఇళ్లల్లోని బోర్లు నుంచి కూడా ఉప్పు నీరు రావడంతో స్థానికులు తాగడానికి మినరల్ వాటర్ కొనుగోలు చేసుకుంటున్నారు.1985లో చిట్టివలస జూట్ మిల్లు వెనుక నుంచి ప్రవహిస్తున్న నదిలో రాళ్లతో పూనుగట్టు నిర్మించారు. అది నాలుగేళ్లకే కొట్టుకుపోయింది. అప్పటి నుంచి సముద్రంలో కలిసే నది నీరు అటుపోట్లు వల్ల ఎదురు ప్రవాహం ద్వారా సముద్రపు నీరు ప్రవహించి నదిలో నీటిని ఉప్పుగా మారుస్తోంది. దీనివల్ల పరిసర గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒకటి, రెండు వార్డుల్లోని ప్రజలతో పాటు నగరపాలెం గ్రామస్తులు ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ఐదేళ్ల క్రితం తగరపువలస వద్ద శిథిలమైన పాత వంతెన వద్ద కొత్తగా పూను గట్టు నిర్మించడానికి ప్రతిపాదనలు చేసారు. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదు. జీవీఎంసీ పరంగానూ పూను గట్టు నిర్మిస్తారని, ఉప్పు నీటి సమస్య తీరుతుందని స్థానికులు ఎప్పటి నుంచో ఆశిస్తున్నా.. ఫలితం ఉండడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నదిలో పూను గట్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్న ఒలుపు చందనం విక్రయాలు ప్రారంభం

సింహాచలం, మే 16 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఒలుపు చందనం విక్రయాలను సింహగిరిపై గురువారం నుంచి ప్రారంభించారు. ఈనెల 10న జరిగిన స్వామివారి నిజరూప దర్శనం చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామిపై నుంచి అర్చకులు తొలగించిన నిర్మాల్య చందనం విక్రయాలను ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు ఏఈఓ నక్క ఆనందకుమార్ పర్యవేక్షణలో చేపట్టారు. ఉదయం 9 గంటలకు విక్రయాలు ప్రారంభం కాగా అప్పటికే పెద్ద సంఖ్యలో భక్తులు బారులుతీరారు. ఏఈఓతో పాటు పర్యవేక్షణాధికారి వెంకటరమణ స్వయంగా ప్రసాదాల విక్రయ కేంద్రానికి వెనుక భాగంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. తొలిరోజు సుమారు వెయ్యి పేకెట్లు ఒక్కొక్కటి రూ.10 చొప్పున విక్రయించారు. అలాగే ఈనెల 17, 19, 20, 21 తేదీల్లో కూడా చందన ప్రసాదాల విక్రయాలు కొనసాగుతాయని అధికారులు ప్రకటించారు.



విక్రయ కేంద్రంలో సిబ్బంది

వాంబే కాలనీలో కూలిన మెట్లు

మధురవాడ, మే 16 : జీవీఎంసీ ఏడో వార్డులోని మధురవాడ వాంబే కాలనీలో గురువారం కురిసిన భారీ వర్షానికి 40వ బ్లాకులోని పలుచోట్ల మెట్ల మార్గం, బాల్కనీలో శ్లాబ్ పెచ్చులూడి రాలిపోయాయి. గతంలో కూడా వర్షాలకు ఇటువంటి పరిస్థితులే ఎదురయ్యాయి. ఏడాది కిందట ఈ కాలనీలో బాల్కనీ కూలడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం జరిగిన సంఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు పాతికేళ్ల కిందట నిర్మించిన ఈ కాలనీలోని ఇళ్లు పాతపడిపోయాయి. వీటి నిర్వహణకు నిధులు కేటాయించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు కాలనీవాసులు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో వర్షాలు పడిన ప్రతిసారి ఇటువంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. కాగా సంఘటనా స్థలాన్ని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ సందర్శించి స్థానికులతో మాట్లాడారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు ఇళ్లు, మెట్లు మార్గం, బాల్కనీలను మరమ్మతు చేయాలని ఆయన కోరారు.



40వ బ్లాకులో కూలిన మెట్లు మార్గం

'రసాయన శాస్త్రం..ఉజ్వల భవిష్యత్తు'పై సదస్సు

సాగర్‌నగర్, మే 16 : పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం బోధన, పరిశోధన కార్యకలాపాలను నిర్వహిస్తోందని గీతం రసాయన శాస్త్రవిభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్‌వీఎస్ వేణుగోపాల్ అన్నారు. గురువారం నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వర్సిటీలో రసాయన శాస్త్రం ఉజ్వల భవిష్యత్ అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధ రంగం నుంచి అణు ఉత్పాదన వరకు రసాయన శాస్త్రం విస్తరించిందన్నారు. లారెస్ ల్యాబ్, రెడ్డీస్ ల్యాబ్, ఫైజర్ హెల్త్ కేర్‌లతో తమ విభాగానికి అవగాహన ఒప్పందాలు ఉన్నాయని తెలిపారు. గీతం రసాయన శాస్త్ర విభాగం ప్రముఖ పరిశ్రమలకు తగిన విధంగా కోర్సులను రూపొందిస్తోందని, దీని వల్ల విద్యార్థు లకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు.

'యువత ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి'



జ్ఞాపిక అందుకుంటున్న చైర్మన్ సుందర గోపాల్‌దాస్

సాగర్‌నగర్, మే 16 : యువత ఆధ్యాత్మిక మార్గంలో నడిచి ఆలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్ చైర్మన్ సుందర గోపాల్‌దాస్ పిలుపునిచ్చారు. సాయి ప్రియా రిసార్ట్‌లో జరు గుతున్న సనాతన ధర్మ బోధకుల సమావేశాల ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. నేటి తరం యువత ఆధ్యాత్మిక రంగం వైపు అడుగులు వేసి, రేపటి తరానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. విశాఖ నగరం ఎంతో సుందరమైనదని, ఈ సుందర నగరంలో ఇస్కాన్ ఏర్పాటు కావడం శ్రీకృష్ణుడి అనుగ్రహమేనని తెలిపారు. అనంతరం ఇస్కాన్ విశాఖ శాఖ అధ్యక్షుడు సాంబదాస్ ఇస్కాన్ విశాఖపట్నం చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మాతాజీ నితాయ్‌సేవిని, ఫైడా కృష్ణప్రసాద్, డాక్టర్ పి. విశ్వేశ్వరరావు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు : సీఐ

పద్మనాభం (రూరల్), మే 16 : గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని సీఐ సీహెచ్ శ్రీధర్ హెచ్చరించారు. గురువారం ఆయన రెడ్డిపల్లి, చిన్నాపురం, తునివలస గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతి లేకుండా గ్రామ సభలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ శాంతియుతంగా వ్యవహరించి వివాదాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఓ మృతి

అనకాపల్లి టౌన్, మే 16 : విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మాకవరం వీఆర్‌ఓ బోని కృష్ణారావు (62) బుధవారం రాత్రి పదకొండున్నర గంటలకు మృతి చెందినట్టు హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. త్వరలో రిటైర్‌మెంట్ కానున్న కృష్ణారావు విధి నిర్వహణలో భాగంగా ఏప్రిల్ 28వ తేదీన మోర్చ రోగంతో ఒక్కసారిగా పడిపోయాడు. స్థానికులు సహకారంతో ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో మృతి చెందినట్టు మృతుని అన్న పైడయ్య ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈయన స్వగ్రామం భీమిలి మండలం తాళ్లవలస అని ఆయన తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

'కార్మిక ప్రయోజనాలకు గండి కొడితే సహించం'

ఉక్కుటౌన్‌షిప్, మే 16 : స్టీల్‌ప్లాంట్ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు గండికొడితే సహించబోమని హెచ్‌ఎంఎస్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి జి. గణపతిరెడ్డి అన్నారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

చీటింగ్ కేసులో రేవిడి వైసీపీ నాయకుడు అరెస్టు

పద్మనాభం, మే 16 : అమాయక రైతులను మోసం చేసి వారికి ప్రభుత్వం నుంచి వచ్చిన భూ పరిహారాన్ని కాజేసిన కేసులో వైసీపీ నాయకుడ్ని పద్మనాభం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రేవిడిలో జగనన్న లేఅవుట్ వేయడానికి గ్రామానికి చెందిన పిల్లి గురువులు, చుక్క అప్పయ్యమ్మ, కొల్లి రాములమ్మ తదితరుల వద్ద ప్రభుత్వం సుమారు రెండు ఎకరాల భూమి తీసుకొని వారికి ఒక్కొక్కరికి రూ. 42 లక్షలు చొప్పున ముగురికి రూ.1.26కోట్లు మంజూరు చేసి వారి ఖాతాలకు నగదు బదిలీ చేసింది. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు కోన రమణ, మజ్జి శంకరరావు లబ్ధిదారులకు మాయ మాటలు చెప్పి వారి బ్యాంకు ఖాతాల నుంచి తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను బదిలీ చేయించుకోవడం ద్వారా నేరుగా నగదు ఉపసంహరణ ద్వారా రూ. 80 లక్షల కాజేశారు. దీనిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో బాధితులు మధురవాడ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎట్టకేలకు కోన రమణను అరెస్టు చేసి భీమిలి కోర్టుకు తరలించారు. మరో వైసీపీ నాయకుడు మజ్జి శంకరరావు పరారీలో ఉన్నారు. అతని కోసం పద్మనాభం పోలీసులు గాలిస్తున్నారు.

పెరిగిన సేంద్రియ ఉత్పత్తుల వినియోగం

డాబాగార్డెన్స్, మే 16 : ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ ఉత్పత్తుల వినియోగం పెరుగుతుందని, డిమాండ్‌కు తగ్గట్టుగా దేశంలో పరంపరాగత్ కృషి యోజన కార్యక్రమం ద్వారా సేంద్రియ ఉత్పత్తులను అందిస్తున్నామని ఇనె రా సంస్థ సీఈఓ ఆగమ్ ఖరే అన్నారు. గురువారం సిరిపురంలోని ఓ హోటలలో సేంద్రియ వ్యవసాయంలో పరికరాలు వినియోగంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన రహిత వ్యవసాయాన్ని వృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రం సేంద్రియ వ్యవసాయం కోసం బయో ఇన్‌పుట్‌లను ప్రోత్సహించడం, వాటిని ఉపయోగించడానికి రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించడం ఆనందాయకమన్నారు. అలాగే సేంద్రియ వ్యవసాయంపై ప్రచారం చేయ డానికి క్రికెటర్ ధోనీ అంగీకరించడం మంచి పరిణామమన్నారు.

శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

పద్మనాభం, మే 16 : మండలంలోని శాఖా గ్రంథాలయాల్లో జూన్ 7 వరకు వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయని డీఈఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పాఠశాలల ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న శాఖా గ్రంథాలయాలకు 10 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులను పంపించాలని ఆదేశించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో పఠన నైపుణ్యాలు పెంపొందించడంలో తర్ఫీదు ఇస్తారని డీఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవికి డాక్టరేట్

వెంకోజీపాలెం, మే 16 : ఏయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని, విశాఖలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ. మాధవికి ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ప్రసాద్ పర్యవేక్షణలో డీజిల్ ఇంజన్లలో ఉద్గారాలను తగ్గిస్తూ వాటి సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా జరిపిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ ఇచ్చారు. ఈమేరకు వీసీ ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆమెకు డాక్టరేట్ అందజేశారు.



ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ గురువారం తిరుపతి వెంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనానికి ముందు ఆయన కాలినడకన తిరుమల చేరుకున్నారు.

- విశాఖపట్నం



గంటాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పద్మనాభం మండల నాయకులు

కూటమి విజయం ఖాయం : గంటా

పద్మనాభం (రూరల్), మే 16 : ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభం మండల టీడీపీ అధ్యక్షుడు కోరాడ రమణ, పాండ్రంగి పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలు గంటాను ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో గురువారం కలిసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రచారంలో కార్యకర్తలు చూపిన ఆదరణ ఎన్నడూ మరిచిపోలేనని చెప్పారు. వైసీపీ ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఐదేళ్ల పాటు పార్టీని కంచుకోటగా నిలిపి ఐక్యతను చాటడం అభినందనీయమన్నారు, కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహంతి అప్పలరమణ, (శ్రీను), ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె. రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లు తనిఖీ



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సిరిపురం, మే 16 : ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ మల్లికార్జున గురువారం తనిఖీ చేశారు. భద్రతా పరమైన చర్యలను పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణపై ఆరా తీశారు. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, అధికారులు ఉన్నారు.

సింహగిరిపై భారీ వర్షం



సింహగిరిపై పడుతున్న వర్షం

సింహాచలం, మే 16 : సింహగిరిపై గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. సూర్యోదయం నుంచి ప్రారంభమైన వర్షం రోజంతా కురుస్తూనే ఉంది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు అప్పన్న దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వర్షంలో తడుస్తూనే స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా వర్షం వల్ల సింహగిరిని దట్టమైన కారుమబ్బులు కమ్ముకోవడంతో ప్రకృతి రమణీయంగా కనిపించింది. ఈ దృశ్యాలను పలువురు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి మురిసిపోయారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, మే 16 : ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లపై దాడులకు పాల్పడుతున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాచర్ల, తాడిపత్రి, విశాఖలో వైసీపీ దాడులకు తెగబడిందన్నారు. ఓటు వేయలేదన్న కారణంతో నగరంలోని నూకాలమ్మ ఆలయం వద్ద ఇద్దరు మహిళలు, ఓ యువకుడిపై వైసీపీ గూండాలు దాడికి పాల్పడడం దీనికి నిదర్శనమని తెలిపారు. ప్రశాంత విశాఖను అల్లకల్లోలం చేయాలన్న అరాచక శక్తులకు త్వరలోనే బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.

'టూరిస్టు బస్సుల యజమానుల సమస్యలు పరిష్కరిస్తాం'

ఎంవీపీ కాలనీ, మే 16 : ఉత్తరాంధ్రలోని టూరిస్టు బస్సుల యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉత్తరాంధ్ర టూరిస్ట్ బస్, కాంట్రాక్ట్ క్యారియర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం పేర్కొంది. ఎంవీపీ కాలనీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడారు. గ్రీన్ ట్యాక్స్, ఈచలానా, పార్కింగ్ సమస్యలు వంటి వాటితో యజమానులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై దృష్టిసారించి తగిన పరిష్కారాన్ని చూపుతామని అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ చౌదరి, కార్యదర్శి చిరంజీవి, సంయుక్త కోశాధికారి వీఎల్ రాజు తెలిపారు.

'ఆలయ పరిసరాల్లో మాంసాహారాలు అమ్మరాదు'

భీమునిపట్నం మే 16 : బీచ్ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం పరిసర ప్రాంతాల్లో మాంసాహారంతో కూడిన తిను బండారాల దుకాణాలను తొలగించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. గురువారం వారు జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. 14 ఏళ్లుగా అయ్యప్ప దీక్షలు చేస్తున్నామని, ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన దుకాణాల వల్ల చాలా ఇబ్బందిగా ఉందని చెప్పారు. ఆలయ పవిత్రతకు భంగంగా ఉన్న ఆ షాపులను వేరే ప్రాంతాలకు మార్పు చేయాలని కోరారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆనందపురం, మే 16 : మండలంలోని చందక గ్రామంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. క్షయ వ్యాధి టీకాల రాష్ట్ర పరిశీలకురాలు నిర్మల గౌరి మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా దశలోనే నివారించాలన్నారు. అనంతరం గ్రామస్తులకు డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి పుర్నేంద్రబాబు, వైద్యాధికారి గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి రూ. 50 వేలు విరాళం

పద్మనాభం, మే 16 : మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ రెల్లిపేటలో రామాలయం నిర్మాణానికి అనంతపద్మనాభ సేవా సంస్థ ద్వారా మాజీ ఎంపీపీ డి. గోపాలకృష్ణమూర్తిరాజు (గోపీబాబు) గురువారం రూ. 50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గోపీబాబు మాట్లాడుతూ ఆలయ నిర్మాణాన్ని దాతల సహకారంతో మూడు నెలల్లో పూర్తి చేయడానికి తమ సంస్థ ద్వారా కృషి చేస్తామన్నారు. ఆలయం లోపలి భాగంలో గ్రానైట్‌ను తాము సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గేదేల చంద్రరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు,టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు రమణ, శ్రీరాములు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.